ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

వార్త

శనివారం 05, సెప్టెంబర్ 2026 16 పేజీలు




# భద్రాచలంలో మంత్రి పొంగులేటి..

# కీలక వ్యాఖ్యలు

పోలవరానికి వ్యతిరేకం కాదు.. తెలంగాణ ముంపుపై అభ్యంతరం

- ఆలయ పునర్నిర్మాణానికి వేగం పెంచాలి!
- ఆలయ పనుల్లో జాప్యం సహించేది లేదు
- మూడు షిఫ్టుల్లో.. 24 గంటలు పనులు!
- నాణ్యతలో రాజీ ప్రసక్తే లేదు
- ఆలయ పనులు 25 శాతమే.. మంత్రి అసంతృప్తి
- రాళ్ల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- అవసరమైతే తక్షణ నిర్ణయాలు తీసుకోండి
- రామయ్య ఆలయ వైభవమే లక్ష్యం
- పోలవరం ముప్పు పొంచి ఉంది!
- బీఆర్ఎస్ వైఫల్యంతోనే పోలవరం ముప్పు
- భద్రాచలం నుంచి ములుగు వరకు బ్యాక్‌వాటర్ భయం
- 20-25 అడుగుల మేర పెరగనున్న వరద ఉధృతి!
- గోదావరి పరివాహక ప్రాంతాల రక్షణకు కేంద్రం స్పందించాలి
- పార్లమెంట్ సమావేశాల నాటికి కేంద్రం ముందుకు తెలంగాణ బృందం
- ఆలయ పునర్నిర్మాణానికి వేగం..
- గోదావరి పరిరక్షణకు పోరాటం



భద్రాచలం, సెప్టెంబర్ 4,(ప్రభాతవార్త)
దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్వామివారిని



2వ పేజీలో...



దర్శించుకున్న అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆలయ అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణలతో కలిసి మంత్రి సమీక్ష



16వ పేజీలో...

## మహిళలు.. కోటీశ్వరులవ్వాలి

మహిళా సంఘాలకు అండగా ప్రభుత్వం

వడ్డీలేని రుణాలు, ఉపాధి అవకాశాలు...

మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేసిన మంత్రి సీతక్క

సత్తుపల్లి సెప్టెంబర్ 4 ప్రభాతవార్త



2వ పేజీలో...

## భద్రాద్రికి విమానాశ్రయం.. కదులుతున్న అడుగులు!

- స్థల ఎంపికపై ఈ నెల 7న కేంద్ర సాంకేతిక బృందం పరిశీలన
- రాష్ట్ర ప్రతిపాదనకు కేంద్రం సానుకూల స్పందన..
- ప్రత్యామ్నాయ ప్రాంతాలపై దృష్టి

ఖమ్మం బ్యూరో,ప్రభాతవార్త: దశాబ్దాలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న భద్రాద్రి కొత్తగూడెం విమానాశ్రయ కల సాకారమయ్యే దిశగా అడుగులు పడుతున్నాయి. విమానాశ్రయ ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో ప్రాజెక్టుపై మళ్లీ ఆశలు చిగురించాయి. ప్రతిపాదిత ప్రాంతాల్లో అనువైన స్థలాన్ని గుర్తించేందుకు కేంద్ర సాంకేతిక బృందం ఈ నెల 7న జిల్లాలో పర్యటించనుంది. నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ ప్రాంతాలను బృందం పరిశీలించి భౌగోళిక, వాతావరణ, సాంకేతిక అంశాలను అధ్యయనం చేయనుంది.




2వ పేజీలో...

## శిరీష కుటుంబానికి.. ప్రభుత్వం అండ

మంత్రి పొంగులేటి

రూ.5 లక్షల ఆర్థిక సాయం.. ఇందిరమ్మ ఇల్లు మంజూరు..

నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు

ములకలపల్లి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:
హైదరాబాద్‌లో దారుణ హత్యకు గురైన ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన గిరిజన యువతి, స్టాఫ్ నర్స్ ఊకే శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం చౌటిగూడెం గ్రామంలోని శిరీష నివాసానికి వెళ్లిన మంత్రి.. ఆమె తల్లి, కుటుంబ సభ్యులను పరామర్శించి

## ఖమ్మంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆకస్మిక తనిఖీలు

ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ప్రత్యేక బృందాలు

పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు

పర్యవేక్షించిన సైబర్ సెక్యూరిటీ ఎస్పీ సాయి శ్రీ, పోలీస్ కమిషనర్ సునీల్ దత్

2లో...

ఖమ్మం క్రైమ్, ప్రభాతవార్త
ఖమ్మం నగరంలో తెలంగాణా సైబర్ సెక్యూరిటీబ్యూరో, స్థానిక లా అండ్ ఆర్డర్ పోలీసులతో కలిసి భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఈ సందర్భంగా పది మ్యూల్ ఖాతాలను సీజ్ చేసి, ఇద్దరిని అరెస్ట్ చేశారు. గురు, శుక్రవారాల్లో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అనేక బ్యాంకు శాఖలు, ఏటీఎం కేంద్రాలు, అనుమానితి ప్రాంతాల్లో ఏకకాలంలో స్పెషల్ ఆపరేషన్ నిర్వహించడం గమనార్హం. ఖమ్మం సైబర్ నేరాలకు కేంద్రంగా మారకుండా చూసే లక్ష్యంతో మ్యూల్ ఖాతాలు, అనుమానిత ఏటీఎం,

# భద్రాచలంలో మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు

## మొదటి పేజీ తరువాయి..

నిర్వహించారు.

**ఆలయ పనుల్లో జాప్యంపై అసంతృప్తి**

ప్రస్తుతం ఆలయ పునర్నిర్మాణ పనులు కేవలం 25 శాతం మాత్రమే పూర్తవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులను మూడు షిఫ్టుల్లో నిర్వహించి 24 గంటలూ నిర్మాణ పనులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

**నాణ్యతలో రాజీ వద్దు**

భద్రాచలం ఆలయ పునర్నిర్మాణం అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదని పేర్కొన్న మంత్రి.. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను ఏమాత్రం తగ్గించరాదన్నారు. ఆలయ నిర్మాణానికి వినియోగించే రాళ్ల నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అత్యుత్తమ నాణ్యత కలిగిన రాళ్లనే వినియోగించాలని సూచించారు. అవసరాలపై తక్షణ నిర్ణయాఆలయ నిర్మాణ పనులకు సంబంధించి ఎలాంటి అవసరాలు ఎదురైనా తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పనుల పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపి అనుమతులు తీసుకుని నిధులు, ఇతర అంశాలను వెంటనే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

**రామయ్య ఆలయ వైభవమే లక్ష్యం**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణం కేవలం నిర్మాణ కార్యక్రమం కాదని, భక్తుల విశ్వాసానికి సంబంధించిన పవిత్రమైన బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. స్వామివారి ఆలయ నిర్మాణం లో నాణ్యత, వేగం, శిల్ప వైభవానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**పోలవరం ముప్పుపై తెలంగాణ ఆందోళన**

అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి పోలవరం ప్రాజెక్టు ప్రభావంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాల కారణంగానే తెలంగాణ గోదావరి పరివాహక ప్రాంతాలకు పోలవరం ముప్పు ఏర్పడిందని ఆరోపించారు.

**భద్రాచలం నుంచి ములుగు వరకు ముప్పు**

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో పెద్దగా వరదలు లేకపోయినా.. భవిష్యత్‌లో పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంతో భద్రాచలం నుంచి ములుగు వరకు సాధారణ స్థాయి కంటే 20-25 అడుగుల మేర నీటి ఉధృతి పెరిగే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. ఇది తెలంగాణ గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలకు ఆందోళనకరమైన పరిణామమని పేర్కొన్నారు.

**పోలవరానికి వ్యతిరేకం కాదు.. ముంపుపై అభ్యంతరం**

పోలవరం ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకం కాదని మంత్రి స్పష్టం చేశారు. అయితే ప్రాజెక్టు ప్రభావంతో తెలంగాణలోని ముంపు ప్రాంతాలకు కలిగే నష్టం, భవిష్యత్ వరద పరిస్థితులను కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**కేంద్రం దృష్టికి గోదావరి ముప్పు**

గోదావరి పరివాహక ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేలు గతంలో కేంద్ర జల సంఘం, ఇతర కేంద్ర సంస్థలకు పలుమార్లు విన్నవించినా సమస్యను పట్టించుకోలేదని మంత్రి అన్నారు. తెలంగాణకు సంభవించే ముంపు ముప్పుపై కేంద్రం సమగ్రంగా పునఃపరిశీలన చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**పార్లమెంట్ సమావేశాల నాటికి ఢిల్లీ బాట**

పార్లమెంట్ సమావేశాలు జరిగే నాటికి తెలంగాణ ఎంపీలు, గోదావరి పరివాహక ప్రాంత ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలుస్తామని మంత్రి ప్రకటించారు. పోలవరం ప్రభావంతో తెలంగాణలో తలెత్తే వరద ముప్పును వివరించి, సమస్యను పునఃపరిశీలించాలని కేంద్రాన్ని కోరుతామని తెలిపారు.

**విభజనలో భద్రాచలానికి అన్యాయం**

రాష్ట్ర విభజన అనంతరం అప్పటి ప్రభుత్వ నిరక్ష్య వైఖరితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలు, భద్రాచలం పరిసరాల్లోని ఐదు గ్రామపంచాయతీలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనం కావడం బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. విభజన సమయంలో జరిగిన పరిణామాల ప్రభావం ఇప్పటికీ భద్రాచలం ప్రాంతంపై ఉందన్నారు.

**గోదావరి తీర ప్రాంతాల రక్షణే ధ్యేయం**

పోలవరం ప్రభావంతో తెలంగాణలోని గోదావరి తీర ప్రాంతాలు, పరివాహక ప్రాంతాల ప్రజలకు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. వరద ముప్పును ముందుగానే అంచనా వేసి శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించాలని కోరారు.

**రాముడి సన్నిధిలో అభివృద్ధి సంకల్పం**

శ్రీ సీతారామచంద్రస్వామి దర్శనంతో ప్రారంభమైన మంత్రి పర్యటనలో ఒకవైపు ఆలయ పునర్నిర్మాణానికి వేగం పెంచాలని ఆదేశాలు వెలువడగా.. మరోవైపు గోదావరి పరివాహక ప్రాంతాల భవిష్యత్ రక్షణపై కీలక ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**అధికారుల సమన్వయంతో పనులకు ఊపు**

ఆలయ ఈవో దామోదర్, క్షేత్ర కన్సల్టెంట్ ప్రతినిధులు సత్యకృష్ణ, సూర్యనారాయణమూర్తి, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించి, నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

# శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండ

## మొదటి పేజీ తరువాయి..

ప్రగాఢ సానుభూతి తెలిపారు. శిరీష హత్య ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన శిరీష ఐటీడీఏ జాబ్‌మేళా ద్వారా హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో ఉద్యోగం సాధించి కుటుంబానికి అండగా నిలుస్తున్న సమయంలో ఈ ఘటన జరగడం బాధాక రమన్నారు.బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల ఆర్థిక సాయం చెక్కును మంత్రి అందజేశారు. అలాగే ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్స్ పత్రాలను అందించారు. శిరీష కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.బాధితుల ఇంటి నుంచే పోలీస్ కమిషనర్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడి.. శిరీష బస చేసిన వసతి గృహంలో తక్షణమే తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. హాస్టల్ భద్రతా ప్రమాణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచిం చారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆసుపత్రి యాజమాన్యం, హాస్టల్ నిర్వాహకులపై కూడా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆసుపత్రిని సీజ్ చేయాలని ఆదేశించారు.ఈ ఘటనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి చట్టపరంగా పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఐటీడీఏ పీవో రాహుల్, అదనపు కలెక్టర్ విద్యాచందన పాల్గొన్నారు.

# ఖమ్మంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆకస్మిక తనిఖీలు

## మొదటి పేజీ తరువాయి..

ఏకకాలంలో స్పెషల్ ఆపరేషన్ నిర్వహించడం గమనార్హం. ఖమ్మం సైబర్ నేరాలకు కేంద్రంగా మారకుండా చూసే లక్ష్యంతో మ్యూల్ ఖాతాలు, అనుమానిత ఏటీఎం, చెక్కు విత్ డ్రాయల్స్, అనుమానితి ప్రాంతాలు, ఆర్థిక మార్గాలు, సైబర్ మోసాలకు సహకరించే వ్యక్తులే లక్ష్యంగా ఈ ఆపరేషన్ జరిగింది. ప్రత్యేక ఎన్ఫోర్స్మెంట్ ద్వారా నిర్వహించిన ఈ అపరేషన్ లో బాదిన మురళీకృష్ణ, వడ్లమూడి సాయినివాస్ అనే ఇద్దరు నిందితులను కూడా అరెస్ట్ చేశారు. సైబర్ మోసాల లావాదేవీలకు సహకరించేందుకు ఈ ఇద్దరు 10 మ్యూల్ ఖాతాలను ఇచ్చినట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు గుర్తించారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మొత్తం 30 బ్యాంకు ఖాతాల్లో 121 మ్యూల్ ఖాతాలను, అధిక మొత్తంలో ఏటీఎం విత్ డ్రాయల్స్ కు సంబంధించి 273 ఖాతాలను, రూ. 20,000 వేలకు మించిన చెక్కు విత్ డ్రాయల్స్ లో పాల్గొన్న 12 ఖాతాలను, 25 అనుమానిత ప్రాంతాలను గుర్తించారు. గుర్తించిన ఆయా ఖాతాలు, ప్రాంతాలకు దేశవ్యాప్తంగా, తెలంగాణాలో అనేక సైబర్ నేరాల కేసులతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో విశ్లేషణలో మొత్తం రూ. 7.84 కోట్ల లావాదేవీలు వెల్లడయ్యాయి. వీటిలో రూసీఎస్బీ (సైబర్ సెక్యూరిటీ బ్యూరో) గుర్తించిన ఆయా అనుమానితి, ఆర్దీక లావాదేవీలను, పరస్పర సంబంధిత నేరాల విశ్లేషణ ఆధారంగా ప్రత్యేకంగా నిర్వహించిన దాడిలో 40 మంది పోలీసు అధికారులతో కూడిన 11 టీంలు పాల్గొన్నాయి. మ్యూల్ ఖాతాలపై దాడులను తీవ్రతరం చేసి, మొత్తం ఎనిమది పోలీస్ స్టేషన్లలో 25 ఎఫ్ఎఆర్ లు నమోదు చేశారు. పోలీస్ స్టేషన్లవారీగా ఖమ్మం టూ టౌన్ లో 7, ఖానాపురం హవేలీలో 7, ఖమ్మం వన్ టౌన్ లో 4, ఖమమం టూ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లలో రెండు చొప్పున, కారేపల్లి, నేలకొండపల్లి, కామేపల్లి పోలీస్ స్టేషన్లలో ఒక్కొటి చొప్పున ఎఫ్ఎఆర్ లు నమోదు చేశారు. ఈ భారీ ఆపరేషన్ లో సైబర్ క్రైమ్స్ ఎస్పీ బి సాయి శ్రీ పర్యవేక్షణలో ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సమన్వయంతో నిర్వహించారు. సిఎస్బి డిఎస్పీ ఎస్ పి కే వి ఎం ప్రసాద్, సీసీపీఎస్ అధికారి ఫణిందర్, సూర్యాపేట డిఎస్పి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

# భద్రాద్రికి విమానాశ్రయం.. కదులుతున్న అడుగులు!

## మొదటి పేజీ తరువాయి..

**రాష్ట్రం నుంచి ప్రతిపాదనలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. పాల్వంచ సమీపంలో విమానాశ్రయం ఏర్పాటుకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం సుమారు 950 ఎకరాల భూమిని ప్రతిపాదించింది. ఈ స్థలంలో విమానాశ్రయం నిర్మాణానికి ఉన్న సాధ్యాసాధ్యాలపై ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధ్యయనం చేపట్టే ప్రక్రియ కూడా కొనసాగింది. సాంకేతిక, ఆర్థిక, పర్యావరణ అంశాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్లాల్సి ఉంటుందని కేంద్రం భావిస్తుంది. అయితే ప్రతిపాదిత ప్రాంతంపై వివిధ సాంకేతిక అంశాలు తెరపైకి రావడంతో ప్రత్యామ్నాయ ప్రాంతాలను గుర్తించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో నాలుగైదు ప్రాంతాలను పరిశీలించి వాటిలో విమానాశ్రయానికి అత్యంత అనుకూలమైన స్థలాన్ని గుర్తించేందుకు కేంద్ర బృందం రానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. జూలైలోనూ సీతంపేట, సుజాతనగర్ తదితర ప్రాంతాలను పరిశీలనలోకి తీసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి.

**రెండు స్థలాలకు ప్రతికూల నివేదిక..**

2025 జనవరిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిపాదించిన స్థలంపై ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (తితి) ప్రీఫీజిబిలిటీ అధ్యయనం నిర్వహించింది. కేంద్ర ప్రభుత్వానికి 2026 మార్చిలో ఇచ్చిన సమాధానంలో, పాల్వంచ గ్రామం వద్ద ప్రతిపాదించిన స్థలం సాధ్యాసాధ్యాల నివేదిక ప్రకారం అనుకూలంగా లేదని పేర్కొంది. ఇదే సమయంలో పాత ప్రతిపాదనల్లో భౌగోళిక పరిస్థితులు, సమీపంలోని కొండలు, రైల్వే మార్గం వంటి అంశాలు కూడా సమస్యలుగా మారినట్లు నివేదికలు వెల్లడించాయి. కొత్త విమానాశ్రయాల ఏర్పాటులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం గతంలో గుర్తించిన ఆరు ప్రాంతాల్లో కూడా ఏ ఏ ఐ ప్రాథమిక అధ్యయనాలు నిర్వహించినట్లు పార్లమెంట్ రికార్డులు పేర్కొంటున్నాయి. వాటిలో భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతం కూడా ఉంది. అయితే కాలక్రమంలో కొన్ని ప్రతిపాదనలు మారాయి.

**కొత్తగా సీతంపేట-సుజాతనగర్‌పై దృష్టి**

పాత స్థలాలు అనుకూలంగా లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ప్రత్యామ్నాయ ప్రాంతాల అన్వేషణ చేపట్టింది. తాజా సాధ్యాసాధ్యాల అధ్యయనంలో ..సీతంపేట, సుజాతనగర్ ప్రాంతాలు.. అనుకూలంగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించినట్లు 2026 జూలైలో వచ్చిన నివేదిక వెల్లడించింది. రాజ్ టెక్నాలజీస్ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో మొత్తం ఆరు ప్రాంతాలను భూమి లభ్యత, భూభాగ స్వరూపం, పర్యావరణ ప్రభావం, రన్‌వే అమరిక, రవాణా అనుసంధానం తదితర అంశాల ఆధారంగా పరిశీలించినట్లు పేర్కొంది. సీతంపేట-సుజాతనగర్ పరిధిలో సుమారు ..667 ఎకరాల ప్రాంతాన్ని.. కొత్త ప్రతిపాదిత స్థలంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తెచ్చినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ ప్రాంతంపై కేంద్ర స్థాయిలో తుది ఆమోదం రావాల్సి ఉంది. ఇప్పటికే గతంలో గుర్తించిన స్థలాలు అనుకూలంగా లేవని తేలిన నేపథ్యంలో కొత్త ప్రాంతాలపై కేంద్ర సాంకేతిక బృందం ప్రత్యక్షంగా పరిశీలన చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.

**కేంద్రం నుంచి కీలక భరోసా**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులను ఆదేశించినట్లు తాజా సమాచారం. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఉన్న ప్రాంతానికి విమాన కనెక్టివిటీ అవసరాన్ని కూడా కేంద్రం పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. కొత్తగా గుర్తించిన స్థలాలపై కేంద్ర సాంకేతిక బృందం నివేదిక కీలకం కానుంది. నివేదిక అనుకూలంగా వస్తే తదుపరి ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంది. విమానాశ్రయం నిర్మాణానికి స్థలం ఎంపిక అంత తేలికైన విషయం కాదు. రన్‌వేకు అవసరమైన విస్తీర్ణం, భూసేకరణ, భూమి స్వభావం, అటవీ ప్రాంతాల పరిస్థితి, వాతావరణం, విమానాల రాకపోకలకు అనుకూలత, సమీపంలో ఉన్న కొండలు, విద్యుత్ లైన్లు, రహదారి అనుసంధానం వంటి అంశాలను సాంకేతిక బృందం పరిశీలించాల్సి ఉంటుంది. ఈ అంశాలన్నింటినీ అధ్యయనం చేసిన తర్వాతే తుది స్థలంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**భక్తులు, పరిశ్రమలకు ప్రయోజనం**

విమానాశ్రయం ఏర్పాటైతే భద్రాద్రి ప్రాంతానికి రవాణా రంగంలో భారీ మార్పులు వచ్చే అవకాశం ఉంది. ప్రధానంగా భద్రాచలం సీతారాముల దర్శనానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుంది. ప్రస్తుతం సుదూర ప్రాంతాల నుంచి రోడ్డు, రైలు మార్గాలపైనే ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది. విమాన సౌకర్యం అందుబాటులోకి వస్తే పర్యాటక రంగానికి కొత్త ఊపు వచ్చే అవకాశం ఉంది. అదే సమయంలో కొత్తగూడెం-పాల్వంచ ప్రాంతంలోని పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు కూడా విమానాశ్రయం ఉపయోగకరంగా మారనుంది. సింగరేణి, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, పెట్టుబడిదారులకు వేగవంతమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. వైద్య, విద్య, పర్యాటక రంగాల అభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుందని స్థానికులు భావిస్తున్నారు. విమానాశ్రయం అంశాన్ని రాజకీయాలకు అతీతంగా తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. గతంలో ప్రతిపాదనలు, అధ్యయనాలు జరిగినప్పటికీ ప్రాజెక్టు కార్యరూపం దాల్చకపోవడంతో ప్రజల్లో కొంత నిరాశ నెలకొంది. ప్రస్తుతం కేంద్ర సాంకేతిక బృందం స్థల పరిశీలనకు రావడం కొత్త ఆశలు కలిగిస్తోంది. సెప్టెంబరు 7న జరగనున్న స్థల పరిశీలన అనంతరం కేంద్ర బృందం ఇచ్చే నివేదికపై అందరి దృష్టి నెలకొంది. అనుకూల స్థలం ఖరారై, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కొనసాగితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విమానాశ్రయ కలకు మరింత స్పష్టమైన రూపం వచ్చే అవకాశముంది. అయితే ....ప్రస్తుతం విమానాశ్రయం నిర్మాణానికి తుది అనుమతి వచ్చినట్లు కాకుండా, స్థల ఎంపిక-సాంకేతిక సాధ్యాసాధ్యాల పరిశీలన దశలోనే ప్రక్రియ కొనసాగుతోందన్నది కీలకం.

## వరలక్ష్మి వైభవం

**ఇల్లందు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:**

శ్రావణ మాస పవిత్రతకు ప్రతీకగా నిలిచే వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ఇల్లందు పట్టణంలోని ఆర్అండ్ఆర్ కాలనీ 13వ వార్డు కౌన్సిలర్, శివశక్తి దండు సారయ్య (సారిక చౌదరి) స్వగృహంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధమైన పూజలు, మహిళల సందడి, మంగళహారతులతో దండు సారయ్య నివాసం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని దండు సారయ్య కుటుంబ సభ్యులు ఇంటిని ప్రత్యేకంగా అలంకరించారు. ఇంటి ముందు అందమైన ముగ్గులు, మామిడి ఆకుల తోరణాలు, వివిధ రకాల పుష్పాలతో పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూజా వేదికపై వరలక్ష్మీ అమ్మవారిని పసుపు, కుంకుమ, పుష్పాలు, పట్టువస్త్రాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. కలశ స్థాపనతో ప్రారంభమైన పూజా కార్యక్రమాల్లో లక్ష్మీదేవికి ప్రత్యేక అర్చనలు, అష్టోత్తర పూజలు, మంగళహారతులు నిర్వహించారు. కుటుంబ





సభ్యులతో కలిసి దండు సారయ్య భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ప్రతి ఇంటా సుఖశాంతులు, సిరిసంపదలు, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు. సంప్రదాయానికి ప్రతీకగా వాయినాలువ్రతం అనంతరం మహిళలకు సంప్రదాయబద్ధంగా వాయినాలు అందజేశారు. పసుపు, కుంకుమ, తాంబూలం, పండ్లు, ప్రసాదాలతో కూడిన వాయినాలను మహిళలకు అందించి సత్కరించారు. మహిళలు పరస్పరం వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటూ వరలక్ష్మీ అమ్మవారి ఆశీస్సులు పొందారు. దీంతో దండు సారయ్య స్వగృహంలో పండుగ సందడి మరింత పెరిగింది. భక్తి.. సంప్రదాయం.. సౌభాగ్యంవరలక్ష్మీ వ్రతం కేవలం ఒక పూజా కార్యక్రమం మాత్రమే కాకుండా కుటుంబ సౌభాగ్యం, ఐశ్వర్యం, సుఖశాంతులను ఆకాంక్షించే మహిళల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుంది. శ్రావణ మాసంలో మహిళలు భక్తిశ్రద్ధలతో ఈ వ్రతాన్ని ఆచరించడం తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. వాయినాలు ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా మహిళల మధ్య ఆత్మీయత, సోదరభావం మరింత బలపడుతుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక శోభతో కళకళలాడిన ఆర్అండ్ఆర్ కాలనీదండు సారయ్య స్వగృహంలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. భక్తిగీతాలు, మంగళహారతులు, అమ్మవారి నామస్మరణలతో ఆర్అండ్ఆర్ కాలనీ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. భక్తి, సంప్రదాయం, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ వేడుక అందరినీ ఆకట్టుకుంది. కుటుంబ సభ్యులతో కలిసి దండు సారయ్య నిర్వహించిన ఈ వరలక్ష్మీ వ్రత వేడుకలో అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సౌభాగ్యం, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ పూజా కార్యక్రమాలను ముగించారు.

## నేరాలు-దారుణాలు

## ఉప సర్పంచ్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిని సన్మానించిన తల్లాడ నేతలు



**తల్లాడ సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**

సర్పంచ్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోట్ల కార్తీక్ ను తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరావు తోపాటు ఉప సర్పంచ్లు సన్మానించారు ఇటీవల పెనుబల్లి మండలంలో ఉప సర్పంచ్ మృతిచెందగా పరామర్శించడం కోసం వెళుతున్న కార్తీక్ ను తల్లాడ మండలంలోని ఉపసర్పంచ్లు పైడిపల్లి జగన్ కర్నాటి లక్ష్మారెడ్డి గుజ్జర్లపూడి చింటూ రామకృష్ణ చారి బండి బాలసౌరి ఇంజం కృష్ణార్జునరావ్ పుష్పమ్మ పాల్గొన్నారు

## మహాసభల విజయవంతం చేయాలి



**టేకులపల్లి, ప్రభాతవార్త :**

అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభల విజయవంతం కై టేకులపల్లి మండలంలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు ప్రచారంలో రైతాంగ సమస్యలు గిట్టు బాటు ధరలు పెరుగుతున్న మందు కట్టల ధరలు యూరియా కొరత తదితర సమస్యల పై రైతన్నకు గ్రూపు మీటింగ్ ల ద్వారా రైతు కూలీ సంఘం నాయకులు కల్తీ వెంకటేశ్వర్లు భూక్యా హర్జ గూగులోతు రామచంద్ వివరించుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు సెప్టెంబర్ 8, 9 తేదీలలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరుగుతున్న మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ 9వ మైలు తండా యర్రాయి గూడెం లలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చంద్య భద్రూ. లక్కానర్వన్ రాజు. కృష్ణ. నాగార్జున. రామనాథం లక్ష్మీనారాయ సమ్మయ్య పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం.



కోయగూడెం పంచాయతీ దంతల తండ గ్రామంలో భూక్య కోటేశ్వరావు లలిత దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరై ఇంటిని ప్రారంభించారు లబ్ధిదారునికి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు నూతన గృహప్రవేశం ద్వారా కుటుంబం గౌరవప్రదంతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమం నియోజకవర్గ నాయకులు కోరం ఉమా సురేందర్ కోయగూడెం సర్పంచ్ బోసు తదితరులు పాల్గొన్నారు

## ఇచ్చిన హామీలను అమలు చేయడం లో కాంగ్రెస్ సర్కార్ విఫలం

**కామేపల్లి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**

:ప్రజా సమస్యలను గాలికి వదిలి ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్సీ తాత మధు సూదన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనా వైఫల్యాలను నిరసిస్తూ శుక్రవారం ఇల్లందు ఖమ్మం ప్రధాన రహదారిలో కామేపల్లి మండలం కొత్త లింగాల క్రాస్ రోడ్ లో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున ఖివంటావార్పుఖి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు. ఇచ్చిన హామీలు 420 గా మిగిలిపోయాయని కాంగ్రెస్ పాలకులు అలవి కానీ హామీలు ఇచ్చి ప్రజల నుండీ తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటుందని ప్రభుత్వ విధానాల పట్ల



ప్రజలు విసుగు పోయి ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పాలకు లను అడుగడుగునా నిలదీయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన తుస్సే అన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో మండ

మాజీ అధ్యక్షుడు అంతోటి అచ్చయ్య, మండల నాయకులు మల్లెంపాటి శ్రీనివాసరావు, సామా మోహన్ రెడ్డి, కాత్రాల రాంబాబు, వడియాల కృష్ణారెడ్డి, తీర్థాల చిదంబర రావు, మండల



మహిళా నాయకురాలు మల్లెంపాటి కవిత, సర్పంచ్ లు జాటోత్ లూసి, ధరావత్ నాగమణి, పడిగ నాగమణి, మాలోత్ కిషన్ నాయక్, సతాకోటి హనుమంతరావు, చిప్పలపల్లి శ్రీనివాసరావు, ఆదూరి ప్రసాద్, రాయల చిన్న వెంకటేశ్వర్లు, పాలెం మధు, ఎన్. చందర్ రావు, కన్నమాల రాంబాబు, జల్లి రాములు, గండమాల చందర్ రావు, అజ్మీర కుమార్, కొనకంచి శంకర్ రావు, చిప్పలపల్లి పుల్లయ్య, ధరావత్ రాందాస్ నాయక్, నాగరాజు, బత్తుల పుల్లయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, కామేపల్లి సెల్ పాయింట్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లాడ లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**తల్లాడ సెప్టెంబర్ 4 : ప్రభాతవార్త**

తల్లాడ మండలంలో కృష్ణాష్టమి పండుగను పురస్కరించుకొని చిన్నారులు పాఠశాలలో శ్రీకృష్ణుడి వేషాధారణతో ఆకట్టుకున్నారు ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ చిన్నారులను కృష్ణుడి వేషధారణతో అందంగా అలంకరించి పిల్లల్లో ఉన్న సృజనాత్మక కళాశక్తులను బయటకు తీయడం కోసం చేసిన కృషి ఫలించిందని చెప్పవచ్చు రాను రాను ఇంగ్లీష్ మోజులో పడి



ప్రాథమిక దశలోనే చదువుపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో కృష్ణాష్టమి పండుగ సందర్భంగా తల్లిదండ్రులు అమ్మమ్మ నాయనమ్మలు మనవడిపై ఉన్న అభిమానంతో వేషధారణ పై





ఆసక్తి పెంచుకుంటున్నారు అలాగే తల్లాడ లో శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉట్టి కొట్టుడు కార్యక్రమాల్లో చిన్నారులతోపాటు దగ్గుల శ్రీనివాసరెడ్డి దగ్గుల బ్రద్రారెడ్డి పాల్గొన్నారు

## ఎంఈఓను సన్మానించిన యోగ పాఠశాల యాజమాన్యం

**తల్లాడ సెప్టెంబర్ 4 ప్రభాత్ వా ర్త**

జపాన్ లో అక్కడి ప్రభుత్వం విద్యాశాఖ పై అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయడం కోసం తెలంగాణ ప్రభుత్వం ఖమ్మం జిల్లా నుండి ఎంపిక చేసిన ఎంఈఓ ఎన్ దామోదర్ ప్రసాద్ ను తల్లాడ వ్యాపారులు యోగ సభ్యులు బాల భారతి యాజమాన్యం ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు ఎస్సీ ఈఆర్టి బృందంలో ప్రసాద్కు అవకాశం రావడం ఆయన పనితీరుకు నిదర్శనమని పలువురు కొనియాడారు



బృందంలో దామోదర్ ప్రసాద్ ఎంపిక కావడం అందరికీ గర్వకారణం అని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రేమ్ నిరంతరం మల్లేష్ గురూజీ నంబూరి నారాయణరావు మోహన్ రావు దారా విష్ణు మోహన్ రావు కర్నాటి లక్ష్మారెడ్డి రేగళ్ల పుల్లారెడ్డి దగ్గుల నారాయణరెడ్డి పులబాల వెంకటేశ్వరరావు డి అజయ్ కుమార్ కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్ రాధా శ్రావణి ప్రిన్సిపాల్ తాళ్లూరు రామారావు తదితరులు పాల్గొన్నారు

## అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

**తల్లాడ సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**

తల్లాడ మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో కలిసి నాయకులు విజ్ఞప్తి చేశారు మండలంలో గ్రామపంచాయతీలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు సత్తుపల్లి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆమెను సన్మానించి సమస్యలతో కూడిన వినతి పత్రాలను అందజేశారు అన్నారుగూడెం నుండి జన్నారం వెళ్లే రోడ్డుకు అంజనాపురం నుండి



బిల్లుపాడు రహదారికి నిధులు మంజూరు చేయాలని అంబేద్కర్ నగర్ నుండి రిజర్వాయర్ వెళ్లే రహదారికి నిధులు మంజూరు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి గోవింద శ్రీనివాసరావు జక్కంపూడి కిషోర్ తుమ్మలపల్లి రమేష్ రాయల రాము మర్సకట్ల బాబురావు పోట్రు శరత్ తదితరులు పాల్గొన్నారు




# మంత్రి రాకతో పోతిరెడ్డి ఇంట సందడి

## నూతన దంపతులను ఆశీర్వదించిన

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

బూర్గంపహాడ్, ప్రభాతవార్త:



కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి ఇంట ఇటీవల జరిగిన వివాహ వేడుకకు హాజరుకానందున నూతన దంపతులను ఆశీర్వదించేందుకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం వారి నివాసానికి చేరుకున్నారు.నూతన దంపతులను ఆప్యాయంగా పలకరించి ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షి స్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోతిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మంత్రి ఆత్మీయంగా ముచ్చటించారు.మంత్రి వెంట ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆది నారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

# శ్రీకృష్ణ దేవాలయంలో వైభవంగా ఉట్ల పండుగ

## బాలకృష్ణుడి లీలలను స్మరిస్తూ భక్తుల సంబరాలు

## జయజయధ్వానాలతో మార్మోగిన రామాలయం వీధి

## ఉట్టి కొట్టేందుకు యువత ఉత్సాహం

## అలరించిన వేదువేదోక్తంగా పూజలు

## శ్రీకృష్ణుడికి లాలలు, జోలలు

భద్రాచలం కల్చరర్, సెప్టెంబర్ 4(ప్రభాతవార్త):

శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాచలంలోని రామాలయం వీధిలో ఉన్న శ్రీకృష్ణ దేవాలయంలో శుక్రవారం ఉట్ల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారికి తీపి పదార్థాలు, వివిధ రకాల ప్రసాదాలను నివేదించారు. బాలకృష్ణుడి లీలలను స్మరించుకుంటూ భక్తులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.సర్పంచ్ పూనెం కృష్ణదొర, ఆలయ కమిటీ చైర్మన్ బొల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉట్టి వేడుకను నిర్వహించారు. ఉట్టిని కొట్టేందుకు యువత ఉత్సాహంగా పోటీ పడగా, పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు కేరింతలు, జయజయధ్వానాలతో వేడుకను ఆస్వాదించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంది.అంతకుముందు రామాలయంలో ఉట్ల పండుగలో భాగంగా దర్బారు సేవ అనంతరం శ్రీకృష్ణావతార రాముడికి లాలలు, జోలలు నిర్వహించారు. వేదోక్త మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక సేవలు నిర్వహించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారగా, శ్రీకృష్ణ నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. జన్మాష్టమి వేడుకలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచాయి.



# ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

## నేడు ఘనంగా అవార్డు ప్రదానోత్సవం

భద్రాచలం, ప్రభాతవార్త:

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాచలం మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎనిమిది మందిని ఎంపిక చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వుల మేరకు మండల విద్యాధికారి బెక్కంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, వివిధ ఉపాధ్యాయ సంఘాల సమన్వయంతో ఈ ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. ఎంపికైన ఉపాధ్యాయులకు సెప్టెంబర్ 5న సాయంత్రం 3 గంటలకు భద్రాచలం మండల విద్యా వనరుల కేంద్రంలో అవార్డు ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి తెలిపారు.ఎంపికైన వారిలో..జడ్పీహెచ్‌ఎస్ భద్రాచలం పాఠశాలకు చెందిన బీవీ రత్నకుమారి (ఎస్ఏబయలాజికల్ సైన్స్), కే. పుష్పలత (ఎస్ఏఫిజికల్ సైన్స్), జీహెచ్‌ఎస్ భద్రాచలం నుంచి బి. జయబాబు (ఎస్ఏబయలాజికల్ సైన్స్), పి. నాగమణి (ఎస్ఏసోషల్), ఎంపీపీఎస్ లంబాడి కాలనీకి చెందిన ఎస్. అరుణకుమారి (ఎస్‌జీటీ), ఎంపీయూపీఎస్ జగదీష్ కాలనీకి చెందిన ఎస్. ఆశాలత (ఎస్‌జీటీ), ఎంపీపీఎస్ రెవిన్యూ కాలనీకి చెందిన ఎస్. శ్రీదేవి (ఎస్‌జీటీ), ఎంపీపీఎస్ తాతగుడి సెంటర్‌కు చెందిన జి. తిరుమలకుమారి (ఎస్‌జీటీ) ఉన్నారు.



**పాఠశాలల అభివృద్ధికి కృషి చేసిన వారికి సత్కారం**

మండల విద్యాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు అన్ని ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలని కోరారు. దీనికి ఆయా సంఘాల నాయకులు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

**సంఘాల సమన్వయంతో వేడుకలు**

ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల బాధ్యులు టి. రామకృష్ణ, బి. కృష్ణ, టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు ఎస్. విజయ్‌కుమార్, కే. శ్రీనివాసరావు, పీఎస్‌వీ ప్రసాద్‌బాబు, ఆట సంఘ నాయకులు కలం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్3లో అర్హులు.. ఇందిరమ్మ ఇల్లు దక్కేదెలా?

## సాంకేతిక నిబంధనలతో పేదలకు అన్యాయం చేయొద్దు

## మంత్రి పొంగులేటి దృష్టికి సమస్యను తీసుకెళ్లిన

## యువజన కాంగ్రెస్ నేత సుశాంత్ రెడ్డి

బూర్గంపహాడ్, ప్రభాతవార్త:



ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హత ఉన్నప్పటికీ ఎల్3 కేటగిరీలో ఉండటంతో ఇల్లు పొందేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదల సమస్యను మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దుగ్గెంపూడి సుశాంత్ రెడ్డి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.ఎల్3 కేటగిరీలో ఉన్న అర్హులైన పేదలను ఎల్12 కేటగిరీకి మార్చడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారని సుశాంత్ రెడ్డి తెలిపారు. దీంతో ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి నిజమైన అర్హత ఉన్నప్పటికీ, కొంతమంది పేద కుటుంబాలకు లబ్ధి చేకూరని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.సాంకేతిక కారణాలు, కేటగిరీల సమస్యలతో అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకం దూరం కాకూడదని ఆయన పేర్కొన్నారు. అర్హత ఉన్న కుటుంబ ాలను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి, సమస్యను పరిష్కరించే విధంగా ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు.పేదల సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రయోజనం అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని సుశాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

# విద్యతోనే జీవితానికి బరోసా గాదంశెట్టి ప్రసన్న లక్ష్మి

చర్ల, సెప్టెంబర్ 4 ( ప్రభాతవార్త )

చిన్ననాటి నుండే క్రమశిక్షణతో చదువుకుంటే జీవితానికి బరోసా ఉంటుందని గాదంశెట్టి ప్రసన్న లక్ష్మి అన్నారు. వస్త్ర వ్యాపారి గాదంశెట్టి నరసింహారావు ప్రసన్న లక్ష్మి దంపతుల కుమారుడు నరసింహ దేవ జన్మదినం సందర్భంగా వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం, శబరి బాలికా నిలయ విద్యార్థులకు 50 కేజీల బియ్యం, భోజనం, బిస్కట్స్, పెన్నులు, పండ్లను అందచేసారు. ఈ సందర్భంగా నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రసన్నలక్ష్మి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సంస్థ ద్వారా ఆదివాసీ చిన్నారులకు విద్యనందించడం సంతోషకరమని పేర్కొన్నారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను జారవిడవకుండా సద్వినియోగ పరుచుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షి ంచారు. ప్రసన్నలక్ష్మి దంపతులు వివిధ సందర్భాలలో విద్యార్థుల చదువులకు సహకరించడం సంతోషకరమని పేర్కొన్నారు. పేద ఆదివాసీ విద్యార్థులపై ఈ దంపతులు చూపుతున్న ప్రేమాభిమానాలు అందరికి ఆదర్శనీయమని అన్నారు. దాతల నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులు మంచిగా విద్యనభ్యసించి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షి ంచారు. కొమరం భీం నిలయ కమిటీ ఉపాధ్యక్షులు గోగికర్ రాంలక్ష్మణ్, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, గాదంశెట్టి సుధారాణి, నంబూరి అశ్విని, లక్ష్మి నర్సింహ దివిత, లేఖ శ్రీ, నిలయ ప్రముఖ్ లు వరలక్ష్మి , సంతోష్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.




# హామీలు అమలు ఎక్కడ...?

## కాంగ్రెస్ పాలనలో

## మహిళలకు అన్యాయం

## మహిళలను మోసం చేసిన

## కాంగ్రెస్ ప్రభుత్వం

## హామీల అమలుకు బీఆర్ఎస్

## మహిళా విభాగం డిమాండ్

భద్రాచలం, ప్రభాతవార్త:



ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో భద్రాచలంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజుల పాలన పూర్తవుతున్నా మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని నాయకులు విమర్శించారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చి మాట తప్పారని మండల పార్టీ నాయకుడు ఆకోజు సునీల్‌కుమార్ ఆరోపించారు.కళ్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామని చెప్పి, ప్రస్తుతం ఆ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు .ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.2,500 ఖాతాలో జమ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. చదువుకున్న ప్రతి విద్యార్థినికి స్కూటీ ఇస్తామని చెప్పి మహిళలు, యువతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు.ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మహిళల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబించడం సరికాదన్నారు.మహిళలకు ఇచ్చిన అన్ని హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ నాయకులు కోటగిరి ప్రబోధ్‌కుమార్, కొల్లం జయ ప్రేమ్‌కుమార్, రేపాక పూర్ణచంద్రరావు, వార్డు మెంబర్ కాపూరు గోపి, మన్మధ, ప్రసాద్, సాయిబాబా, అయినాల రామకృష్ణ, గోసుల శ్రీనివాస్, రవి ఎండీ ముంతాజ్, తదితర మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్మార్ట్ కిడ్జ్‌లో వేడుకగా శ్రీ కృష్ణ జన్మాష్టమి సంబరాలు

**చిన్ని కృష్ణులు రాధాగోపికల**

**వేషధారణలతో మురిసిన విద్యార్థులు**

**ఉట్టి కొట్టే వేడుకలలో సందడే సందడి**

ఖమ్మం విద్యా విభాగం సెప్టెంబర్ 4, ప్రభాత వార్త:





క్రిష్ణాష్టమి సంబరాలతో శుక్రవారం స్మార్ట్ కిడ్జ్ పాఠశాల మురిసిపోయింది. చిన్నారులంతా చిన్ని కృష్ణయ్య,రాధా, గోపికల వేషధారణలతో అందరిని అల్లరించారు. బృందావనంలో చిన్నికృష్ణుడు రాధాగోపికలతో పిల్లనగ్రోవి ఊదుతూ చేసిన సరదాలతో సందడి నెలకొంది. ఉయ్యాలలో ఉన్న చిన్ని కృష్ణయ్య చేసిన అద్భుతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రజలను రక్షి ంచేందుకు చిన్న కృష్ణుడు గోవర్ధన గిరిని చేతితో ఎత్తడం మనుషులతో పాటు గోవులన్నీ గోవర్ధనగిరి కిందకు చేరే సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. పిల్లనగ్రోవితో చిన్ని కృష్ణుడు బృందావనం అంతా కలియ తిరుగుతూ నృత్యాలు చేస్తూ సందడి చేసిన సన్నివేశాలు ప్రత్యేకంగా అలరించాయి. చిన్ని కృష్ణుడు పాదముద్రలతో పాఠశాల ఆవరణలో వేసిన రంగురంగుల ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల విద్యార్థు లంతా బృందావనంలో చేసిన సందడితో మురిసి పోయారు. యశోద చిన్ని కృష్ణుడికి వెన్న తినిపించే సన్నివేశం, వసుదేవుడు యమునా నది దాటి శ్రీకృష్ణుని గోకులానికి తీసుకొచ్చే సన్నివేశాలు,మన్ను తినే చిన్ని కృష్ణయ్య నోటిలో విశ్వాన్ని చూసి ఆశ్చర్యపోయిన యశోద మొదలగు సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ జన్మాష్టమి వేడుకలు మన దేశంలో అంతటా నిర్వహిస్తున్నారని, శ్రీకృష్ణ పరమాత్మ ప్రజలందరికీ నిత్యం గమ్యాన్ని సూచిస్తూ, జీవితంలో కలిగే కష్టనష్టాలను పరిష్కరించుకునే విధానాన్ని తెలియజేశారని తెలిపారు. శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీత ప్రతి ఒక్కరి జీవితాలకు దిశా నిర్దేశం చేస్తున్నదని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడి చూపిన మార్గంలోనే పాండవులు ప్రయాణించి శ్రీకృష్ణుడి ఆలోచనలను ఆచరించడం వల్లనే పాండవులు ఘనవిజయాలను సొంతం చేసుకున్నట్లుగానే విద్యార్థులు శ్రీకృష్ణుడి మార్గంలో సమస్యల పరిష్కారానికి దిశా నిర్దేశాన్ని అనుసరించాలని కోరారు. జన్మాష్టమి వేడుకలలో పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేశారు. పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




## అనాధ మృత దేహానికి అన్నం అంత్యక్రియలు

ఖమ్మం అర్బన్, సెప్టెంబర్ 4(ప్రభాత వార్త )



అన్నం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అన్నం శ్రీనివాసరావు అనాధ మృత దేహానికి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఇటీవల ఖమ్మం మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని అనాధ వృద్ధుడు గత ఆరు రోజుల క్రితం మృతి చెందగా అట్టి మృతదేహాన్ని మూడో పట్టణ పోలీసులు మార్చురీ కి తరలించి భద్రపరిచారు.ఇప్పటివరకు మృతదేహం కొరకు ఎవరూ రానందున అనాథ శవంగా భావించిన పోలీస్ వారు మృతదేహాన్ని అంత్యక్రియలు నిమిత్తం అన్నం ఫౌండేషన్ కి సమాచారం ఇవ్వగా పోలీసులు వైద్యశాల సిబ్బంది సమక్షంలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని బల్లేపల్లి వైకుంఠధామానికి తరలించి దహన సంస్కారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు తో పాటు సిబ్బంది పాల్గొన్నారు

## ఉపాధ్యాయులే సమాజనిర్మాణానికి మార్గదర్శకులు

**హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్లో ఘనంగా**

**ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**

ఖమ్మం విద్యా విభాగం ప్రభాత వార్త:



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నేడు ఉపాధ్యాయుల సేవలను, త్యాగాలను స్మరించుకుంటూ హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ,శ్రీకృష్ణ జన్మాష్టమిని వేడుకలను ఘనంగా నిర్వహించారు. హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్ , ప్రిన్సిపల్ ఆర్. పార్వతీ రెడ్డి బెలూన్లను ఎగురవేసి వేడుకలకు శ్రీకారం చుట్టారు.హార్వెస్ట్ స్కూల్ 25 ఏళ్ళు అయిన సందర్భంగా ప్రత్యేకంగా ఉపాధ్యాయులకోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగింది. ఆద్యంతం పండుగ వాతావరణం తలపించేలా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అలంకరణలతో పాఠశాలకు కొత్త అందాలను సంతరించుకొంది. ఈ వేడుకలకు హార్వెస్ట్ విద్యాసంస్థలైన హార్వెస్ట్ స్ప్రింగ్ లీఫ్, హార్వెస్ట్ టెండర్ రూట్స్, సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్స్‌తో పాటు హార్వెస్ట్ పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఈ వేడుకలలో పాల్గొని వివిధ క్రీడలు, వినోద కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు, డ్రామా మరియు తంబోల వంటి వివిధ వినోదాత్మక ఆటలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండెంట్ రవిమారుత్ మాట్లాడుతూ, ఒక విద్యార్థి జీవితాన్ని సరైన దిశలో నడిపించడంలో ఉపాధ్యాయుడి పాత్ర ఎంతో కీలకమని అన్నారు. పుస్తక జ్ఞానంతో పాటు విలువలు, క్రమశిక్షణ, మానవీయత, బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని విద్యార్థుల్లో పెంపొందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను గౌరవించడం అంటే జ్ఞానాన్ని, విద్యను, సమాజ భవిష్యత్తును గౌరవించడమేనని తెలిపారు.ఈ వేడుకలలో హార్వెస్ట్ ఇంచార్జెస్ ఉమామహేశ్వర రావు, మానస, నాగరాజు, జాకీర్, శ్యామల, స్నేహ, కళాశాల డీన్ సోమశేఖర శర్మ, సెడార్ వ్యాలీ ప్రిన్సిపల్ పరమేశ్వరన్, టెండర్ రూట్స్ అకడమిక్ ఇంచార్జెస్ ఆసీమ, ఉష్రశ్రీ, స్ప్రింగ్‌లీఫ్ ప్రిన్సిపల్ కేశవ్, చందన, ప్రీతీ, యాకయ్య పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు నేడు సన్మానం

**జిల్లా విద్యాశాఖ అధికారిసదానందం**

ఖమ్మం విద్యా విభాగం సెప్టెంబర్ 4 ప్రభాత వార్త:

సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురుతర బాధ్యతలు నెరవేరుస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడం జరుగుతున్నది జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 120 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయడం జరిగిందని, వీరికి కలెక్టర్ కార్యాలయంలో నేటి మధ్యాహ్నం 2:30 గంటలకు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

# ఐక్యంగానే ఉన్నాం

**మరింత సంక్షేమం దిశగా పాలన**

**సురేఖ తొలగింపు బాధే కానీ తప్పదు**

**జర్నలిస్టుల సంక్షేమానికి కృషి**

**ఐజెయు మీట్ ద ప్రెస్ లో కాంగ్రెస్**

**అధ్యక్షులు సత్యనారాయణ**

ఖమ్మం , సెప్టెంబర్ 4, ప్రభాత వార్త:



కాంగ్రెస్ పార్టీలో వర్గాలు లేవని భిన్నాభిప్రాయాలు ఉన్నా ఐక్యంగా పనిచేస్తున్నామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. పాత, కొత్త అనే భేదం లేకుండా అందరికి కలుపుకుపోతూ సమర్థులైన వారికి అవకాశాలు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. సిటీ కాంగ్రెస్, జిల్లా కాంగ్రెస్ సమన్వయంతో పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. శుక్రవారం టియుడబ్ల్యూజె (ఐజెయు) ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్ క్లబ్లో మీట్ ద ప్రెస్ నిర్వహించారు. టియుడబ్ల్యూజె జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరించగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ జిల్లాలో ముగ్గురు మంత్రుల మధ్య ఐక్యత లేదని లక్షణరేఖలు గీసుకుని పనిచేస్తున్నారన్న ప్రశ్నకు సత్యనారాయణ స్పందిస్తూ అది ప్రచారం మాత్రమేనని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంత్రులు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని కాంగ్రెస్ కార్యాలయానికి సైతం ముగ్గురు మంత్రులు వస్తున్నారని కార్యక్రమాలను సమన్వయం చేస్తున్నారని ఆయన తెలిపారు. కొండా సురేఖ తొలగింపు బాధకరమేనని ఓబిసి బిడ్డగా ఆమె తొలగింపు పట్ల ఆవేదన ఉన్నా ప్రస్తుత పరిస్థితులు తొలగింపుకు కారణమైన అంశాల పట్ల కాంగ్రెస్ అధి నాయకత్వంతో ఏకీభవిస్తున్నానని సత్యనారాయణ తెలిపారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందిస్తూ ప్రభుత్వాలు మారినా పాలనకు సంబంధించిన అంశాలు కొనసాగుతాయని రాజీవ్ సాగర్ పేరుతో కాంగ్రెస్ పార్టీ గోదావరిపై ఎత్తిపోతలు ప్రారంభించిందని దాని పేరు మార్చి సీతారామ పేరుతో బిఆర్ఎస్ కొనసాగించిందని దానిని కాంగ్రెస్ పార్టీ పూర్తి చేస్తుందన్నారు. సీతారామ పట్ల నిర్లక్ష్యం లేదని గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మంజిల్లాకు అందించడమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ లోటు బడ్జెట్‌తో రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రారంభమైందని బిఆర్ఎస్ ఉద్యోగుల వేతనాలు ఇవ్వలేక పదవీ విరమణ గడువును పొడిగించిందని, రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉంచిందని బిఆర్ఎస్ తప్పులను కాంగ్రెస్ పార్టీ సరిచేస్తూ పాలనను గాడిలో పెడుతుందన్నారు. 22ఏ పై అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ అధికారుల తప్పిదాల కారణంగా సమస్య తలెత్తిందని దానిని వీలైనంత మేర రైతాంగానికి నష్టం జరగని రీతిలో పరిష్కారం ఉంటుందని కేటిఆర్, హరీష్ రావులు బిఆర్ఎస్ పార్టీ దానిని రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరుచేస్తామని తుది బిల్లులకు సంబంధించి సత్వర చెల్లింపులు జరిగేవిధంగా గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ముగ్గురు మంత్రులతో తనకు సఖ్యత ఉందని డిసిసి నిర్వహిస్తున్న ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు వివిధ శాఖల ద్వారా సమన్వయం చేస్తున్నామన్నారు. కార్పోరేషన్ ఎన్నికలపై కదిలిక లేదన్న మీడియా ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తరహా వ్యూహాన్ని ఖమ్మంలో అమలు చేస్తామని బిఆర్ఎస్ తమకు సరైన పోటీ కాదన్నారు. మాకు ప్రచారానికి పది రోజులు చాలునని ఆయన సమాధానం ఇచ్చారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన మాట వాస్తవమేనని ఖమ్మం సొసైటీ స్థలాల పంపిణీకి సంబంధించి త్వరలో మంత్రుల దృష్టికి, పిసిసి అధ్యక్షుని దృష్టికి తీసుకుపోతా మన్నారు. జర్నలిస్టుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి డిసిసి అధ్యక్షునిగా కృషి చేయడంతో పాటు ఇండ్ల స్థలాల సాధనకు జర్నలిస్టులతో కలిసి పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట అధ్యక్షులు కనకం సైదులు, ఐజెయు నాయకులు వనం వెంకటేశ్వర్లు, చెరుకుపల్లి శ్రీనివాస్, మోహినుద్దీన్, సీ పాల్గొన్నారు.




## విజిలెన్స్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

రుద్రంపూర్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:




సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని వీకేసీఎం వద్ద కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ (సీఎంపిఎఫ్) ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు అవినీతి నిర్మూలన, పారదర్శకత, నిజాయితీ, మరియు అవినీతి నిరోధక చర్యలపై అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిబంధనలను పాటిస్తూ, పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. అవినీతి అనేది సంస్థ అభివృద్ధికి మాత్రమే కాకుండా సమాజ పురోగతికి కూడా అడ్డంకిగా మారుతుందని, దీనిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అధికారులు తెలిపారు. ఉద్యోగులు తమ విధులను నిష్పక్షపాతంగా, నిజాయితీగా నిర్వహిస్తూ సంస్థపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. సీఎంపిఎఫ్ పథకాలు, ఉద్యోగులకు అందుతున్న ప్రయోజనాలు, ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించిన సేవలు మరియు వాటిలో పారదర్శకత ప్రాముఖ్యతపై కూడా అవగాహన కల్పించారు. ఉద్యోగులు తమకు అందుబాటులో ఉన్న అధికారిక సమాచారాన్ని వినియోగించుకోవాలని, మధ్యవర్తులను ఆశ్రయించకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ కమిషనర్ వంశీధర్ , రీజినల్ కమిషనర్ కనకమ్మ , అసిస్టెంట్ కమిషనర్ చిరంజీవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ సులోచన, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్, వికేసీఎం మేనేజర్ మురలి, ఏఐటియూసి రిప్రెసెంటేటివ్ హీరాలాల్ ,ఐఎన్‌టియూసి ఫిట్ సెక్రటరీ గోపు కుమారస్వామి సీఎంపిఎఫ్ అధికారులు, సింగరేణి అధికారులు, వీకేసీఎం ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జెండాలు తొలగించడంపై బీఆర్ఎస్ నిరసన

### అధికారుల తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ నాయకులు

ములకలపల్లి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:

ములకలపల్లి ప్రధాన కూడలిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన పార్టీ జెండాలను అధికారులు తొలగించడంపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరును నిరసిస్తూ శుక్రవారం ఉదయం నాయకులు, కార్యకర్తలు ఘటన స్థలానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. రోడ్డు డివైడర్‌పై ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ జెండాలను అధికారులు తొలగించడాన్ని ఏకపక్ష చర్యగా అభివర్ణించిన నాయకులు.. తొలగించిన ప్రాంతాల్లోనే తిరిగి గులాబీ జెండాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ అధికారులు ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతను విస్మరించి అధికార పార్టీ నాయకుల మెప్పు కోసం పనిచేయడం సరికాదన్నారు. ప్రభుత్వాలు మారుతుంటాయని, అధికారులు మాత్రం నిబంధనలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అధికార పార్టీ అండతో ప్రతిపక్ష పార్టీలపై ఇలాంటి చర్యలకు పాల్పడితే భవిష్యత్‌లో తగిన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## శిరీష కుటుంబానికి అండగా నిలవాలి కోటి పరిహారం

### కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:




శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి కోటి రూపాయల నష్టపరిహారం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశాన్ని కల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ములకలపల్లి మండలం చౌటిగూడెంలో శిరీష కుటుంబాన్ని శుక్రవారం కూనంనేని పరామర్శించి, ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. శిరీష పనిచేసిన ఆస్పత్రిలో సరైన భద్రతా వసతులు లేకపోవడంపై చర్యలు తీసుకోవాలని డీజీపీతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల భూమి అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ తరఫున శిరీష దశదిన కర్మలకు మూడు క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, మేయర్ మూడ గణేష్, నరాటి ప్రసాద్, యండి యూసుఫ్, నరాటి రమేష్, పువ్వాల లలితారావు, అనుముల సాయి, వీరూనాయక్, రంజిత్, ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ పోరాటం ఫలించింది

### కార్మికులకు భారీ ప్రయోజనాలు..

### సమ్మె నోటీసుతో కీలక డిమాండ్ల పరిష్కారం

రుద్రంపూర్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:




ఏఐటీయూసీ సమ్మె నోటీసు, ఆర్ఎల్‌సీ సమక్షంలో చర్చలు, నిరంతర పోరాటం ఫలించాయి. కార్మికుల పలు కీలక డిమాండ్లపై సింగరేణి యాజమాన్యం అగ్రిమెంట్లకు అంగీకరించిందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం పీవీకే5 గని వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జూన్ 8న ఏఐటీయూసీ సమ్మె నోటీసు ఇచ్చిందని, అనంతరం ఆర్ఎల్‌సీ సమక్షంలో పలుమార్లు చర్చలు జరిపామని తెలిపారు. జరిగిన చర్చల్లో పలు డిమాండ్లపై అంగీకారాలు సాధించినట్లు చెప్పారు. కార్మికుల పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్‌ను యాజమాన్యమే భరించడం, సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సహాయం, ప్రతి నెల మెడికల్ బోర్డు నిర్వహణ, 2025-26 వాస్తవ లాభాల ప్రకటన, ట్రాన్స్‌ఫర్ నిబంధనల్లో మార్పులు, అర్హులైన సీనియర్ మైనింగ్ స్టాఫ్‌కు ఓవర్‌మెన్ ప్రమోషన్లు వంటి అంశాలపై అంగీకారం కుదిరిందన్నారు. అలాగే హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు, మెడికల్ అటెండెన్స్ నిబంధనల్లో మార్పులు, సింగరేణి విద్యాసంస్థల్లో సీబీఎస్ఈ సిలబస్, కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ సదుపాయం, డిపెండెంట్ ఉద్యోగాల పెండింగ్ కేసుల పరిష్కారం, ఖాళీల భర్తీకి యాజమాన్యం అంగీకరించిందన్నారు. మెడికల్ ఫిట్ అయిన 149 మంది డిపెండెంట్లకు నెలలోపు ఆఫీస్ ఆర్డర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్మికుల దీర్ఘకాలిక డిమాండ్ అయిన సొంత ఇంటి పథకం అమలుపై ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకునేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. గనుల్లో సేఫ్టీ మెటీరియల్ సకాలంలో అందించడం, మైనింగ్ స్టాఫ్‌కు సూటబుల్ సర్ఫేస్ ఉద్యోగాలు, డిస్మిస్ కేసుల పరిష్కారం తదితర అంశాలపై కూడా అంగీకారాలు సాధించినట్లు తెలిపారు. సింగరేణి భవిష్యత్తు కోసం కొత్త బొగ్గు గనులు, బొగ్గు బ్లాకులు సంస్థకు దక్కేలా ప్రభుత్వం, యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ జోక్యాన్ని తగ్గించి సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయాలని సూచించారు. సాధించిన అగ్రిమెంట్ల అమలును పర్యవేక్షిస్తూ, మిగిలిన సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ పోరాటం కొనసాగిస్తుందని రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. కార్మికుల సమస్యలను ప్రచారానికే పరిమితం చేయకుండా పోరాటాల ద్వారా పరిష్కారాలు సాధించడమే ఏఐటీయూసీ విధానమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శి జక్కుల గట్టయ్య, పిట్ కార్యదర్శులు భుక్య రమేష్, మధుకృష్ణ, కమల్, సహాయ ఫిట్ కార్యదర్శి సందీప్, మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ సాయి పవన్, సేఫ్టీ కమిటీ సభ్యులు రామచందర్, సుమన్, ఎస్.రమేష్, నరేందర్, సురేందర్ రెడ్డి, సంజీవ్, ప్రశాంత్, హరికృష్ణ, ఈర్ప కృష్ణ, సురేష్, రవీందర్ రాజేష్ కోటేశ్వరరావు, నరేష్, వెంటేశ్వర్లు, పంప్ ఆపరేటర్ మహేష్ రామారావు, హరికృష్ణ, కారమోహన్ ,మదనయ్య, ముబారక్, మేకల శీను, మహేష్ సంతానం, బాబురావు, శశివర్ధనరెడ్డి, కరీమ్ ఉల్లా తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కేంద్రానిది... గొప్పలు మాత్రం రాష్ట్రానిది

### కేంద్ర ప్రభుత్వ పనులను తమ ఘనతగా చెప్పుకోవడం హాస్యాస్పదం

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:



కేంద్ర ప్రభుత్వం జిల్లాకు మంజూరు చేస్తున్న అభివృద్ధి పనులను తమ ఘనతగా చెప్పుకోవడం హాస్యాస్పదమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర కేబినెట్ నిన్న పాండురంగాపురం నుంచి మల్కన్‌గిరి వరకు రైల్వే లైన్‌కు ఆమోదం తెలపడం భద్రాద్రి ప్రాంత అభివృద్ధికి కీలక నిర్ణయమని అన్నారు. అయితే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తానే కేంద్రంతో మాట్లాడి తీసుకొచ్చినట్లు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కేంద్రం నిర్ణయాలను వ్యక్తిగత ఘనతగా చెప్పుకొని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటుకు కేంద్ర బృందం సర్వేకు రావడం శుభపరిణామమని, రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా సరైన స్థలాన్ని గుర్తించి సహకరిస్తే విమానాశ్రయ మంజూరుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. గత రెండు నెలల్లో సింగరేణి విషయంలో కేంద్రం కీలక నిర్ణయాలు తీసుకుందని, తాటిచెర్ల బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిందని తెలిపారు. మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్ విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణికి ఇబ్బందులు కలిగించిందని, కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చొరవతో పీకే ఓసీ 2 డీప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కిందని అన్నారు. భవిష్యత్తులో కొయ్యగూడెం ఓసీ3 బ్లాక్‌ను కూడా సింగరేణికే కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. భద్రాచలంలో రెండో వంతెనతో పాటు అనేక అభివృద్ధి పనులకు కేంద్రం నిధులు మంజూరు చేస్తోందని, ఖమ్మం ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ప్రజలకు ఉపయోగపడే పనితీరు కనిపించడం లేదని విమర్శించారు. కేంద్రం అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ఓటు ద్వారా సమాధానం చెబుతారని, తెలంగాణలో బీజేపీకి మరింత బలమైన మద్దతు లభిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఆఫీస్ సెక్రటరీ దురిశెట్టి కుమార్, లక్ష్మీ మ్రదేవిపల్లి మండల అధ్యక్షుడు నవీన్, బూర్గంపాడు మండల అధ్యక్షుడు బీరక సాయి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు జుజ్జూరు మోహనకృష్ణ, ప్రధాన కార్యదర్శి కోల హరీష్, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు మహంకాళి శంకర్, చుంచుపల్లి మండల ప్రధాన కార్యదర్శి బుర్ర సతీష్, కార్మిక సెల్ కన్వీనర్ గుమలాపురం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మధిర సెప్టెంబర్ 4 ప్రభాతవా ర్త

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కృషితో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దెందుకూరు, ఖాజీపురం, రొంపిమల్ల, అల్లినాగారం, కంభంపాడు, రాయపట్నం, మహాదేవపురం, దేశినేనిపాలెం, చిలుకూరు, సిరిపురం, జాలిముడి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మొత్తం రూ.6 లక్షల 50 వేల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను



అందజేశారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు తీవ్ర ఆర్థిక భారంగా మారుతున్నాయని, అలాంటి క్లిష్ట సమయంలో ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ ఆ కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాకుండా.. ఆపదలో ప్రభుత్వం తమకు అండగా ఉందనే భరోసాను కల్పిస్తోందని అన్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మువ్వ వెంకయ్య బాబు, షేక్ జాకీర్ హుస్సేన్, ఫయాజ్, హనుమంతరావు, గొల్లమందల శీను, చల్ల శ్రీనివాసరెడ్డి, మైలవరం చక్రి, తన్నీరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమీ వేడుకలు

కామేపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త:



మండల కేంద్రమైన కామేపల్లి గురు మందిరం లో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతోజరుపుకున్నారు. లోక కళ్యాణం కోసం జరుపుకునే ఈ ఉత్సవాలు సందర్భంగా తొలుత శ్రీ రుక్మిణి సమేత రాధాకృష్ణ కళ్యాణం భక్తుల భగవన్నామ స్మరణ చేస్తూ ఉండగా కన్నుల పండగగా జరిగింది. కళ్యాణ విశిష్టతను అర్చకులు భక్తులకు వివరించారు. అనంతరం అవధూతేంద్ర భక్తమండలి ఆధ్వర్యంలో యువకులు, చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో కోలాహలంగా ఉట్టికొట్టే పండుగ జరిగింది. ఈ కార్యక్రమంలో అర్చకులు సాయి రామకృష్ణ, బుజ్జయ్య, భక్త మండలి అధ్యక్షులు గొట్టుపర్తి శివాజీ, మహంకాళి రామ నర్సయ్య, విజయ, కోటగిరి రాము, గొట్టుపర్తి రఘుకుమార్, కేసగాని నాగయ్య, మోసం కృష్ణమూర్తి, బండి శ్రీనివాస్, రవికుమార్, రమేష్, శ్రీనివాస్, తిరుపతిరావు, రామారావు, రాజేంద్రప్రసాద్, పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు కిషన్ ఎంపిక

కామేపల్లి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:

కామేపల్లి మండలం టేకుల తండా ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల (జిపిఎస్)లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సపావట్ కిషన్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు శుక్రవారం ఎంపికయ్యారు. గిరిజన విద్యా శాఖలో విశిష్ట సేవలు అందించినందుకు కిషన్ ను రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక చేశారు. శనివారం కొడంగల్ లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్య క్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కిషన్ కు రాష్ట్రస్థాయి అవార్డును ప్రధానం చేయనున్నారు. కృషి వలు నికి ప్రత్యేక గుర్తింపుగా అవార్డును అందజేయను న్నారు. రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక చేసినం దుకు ఉపాధ్యాయుడి కిషన్ సీఎం రేవంత్ రెడ్డి, భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్, జిల్లా మంత్రులు, రాష్ట్ర, జిల్లా గిరిజన విద్యా విభాగం అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా కిషన్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడం పట్ల మండల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, రాజకీయ పక్షాల నాయకులు, టేకుల తండా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కిషన్ ఇప్పటికే జిల్లా స్థాయిలో 8 సార్లు, మండల స్థాయిలో 6 సార్లు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకొని తొలిసారి రాష్ట్రస్థాయి అవార్డును సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగానే అందుకోనుండటంతో మండల వ్యాప్తంగా సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది.

## మణుగూరులో మాక్ డ్రిల్ సేఫ్టీ ప్రదర్శ న



మణుగూరు, ప్రభాతవార్త సెప్టెంబర్ 04:

సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా పీకే ఓసీ2 గనిలో శుక్రవారం అత్యవసర మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. ప్రధానంగా గని ఉద్యోగుల భద్రతను మరింత బలోపేతం చేయడం, అనుకోని అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు సిబ్బంది తక్షణ స్పందన, సన్నద్ధతను పరీక్షించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఏరియా అధికారులు తెలిపారు. మాక్ డ్రిల్‌లో భాగంగా ఉదయం 10:40 నుంచి 11:30 గంటల వరకు గనిలోని 830 ఆర్ఎల్ డంప్ యార్డ్ వద్ద డంపర్ బోల్తా పడినట్లు ఊహాత్మక అత్యవసర పరిస్థితిని సృష్టించారు. ఈ ప్రమాద సమాచారం



అందిన వెంటనే సంబంధిత అధికారులు, సేఫ్టీ సిబ్బంది, ఫస్ట్ ఎయిడ్, అంబులెన్స్, మన్వే క్లర్క్, సంక్షేమ విభాగం మరియు ఆసుపత్రి వైద్య సిబ్బంది సమన్వయంతో స్పందించి రక్షణ చర్యలు చేపట్టారు.

ఈ సందర్భంగా ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మాట్లాడుతూ... గనుల్లో ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు ప్రాణనష్టం, గాయాల తీవ్రతను తగ్గించడంలో తక్షణ స్పందన, సమర్థవంతమైన కమ్యూనికేషన్, ప్రాథమిక చికిత్స ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఉద్యోగులు భయాందోళనలకు గురికాకుండా నిర్దేశిత భద్రతా విధానాలను పాటించాలని సూచించారు. ఇటువంటి మాక్ డ్రిల్స్ ద్వారా లోపాలను ముందుగానే గుర్తించి, భవిష్యత్తులో ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా సన్నద్ధతను పెంచుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్, సేఫ్టీ ఆఫీసర్, సూపర్‌వైజర్లు, సంక్షేమ విభాగం ప్రతినిధులు, ఆసుపత్రి వైద్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

చర్ల, సెప్టంబర్ 4 ( ప్రభాతవార్త )

మండలం ఆర్.కొత్తగూడెం కుదునూరు చర్ల గుంపెనగూడెం అంజనాపురం గ్రామాలలో యాదవ కమిటీల ఆద్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉట్టి కట్టి, యువకులు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. రంగులు చల్లుకుంటూ, నీళ్లలో తడుస్తూ యువత కేరింతలు కొడుతూ పండుగను సంబరంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, మహిళలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేశారు. చిన్నపిల్లలందరూ ఉత్సాహంగా పాల్గొనడం విశేషంగా ఆకట్టుకుంది. శ్రీకృష్ణుని బాల్య లీలలను స్మరించుకుంటూ గ్రామాలలో భక్తి శ్రద్ధలతో ఆనందోత్సాహాలతో వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం గ్రామాలలో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.




## భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు.

బోనకల్, ప్రభాతవార్త :



మండల పరిధిలోని గార్లపాడు గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. కృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన పల్లకి సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామివారిని పల్లకిలో కొలువుదీర్చి ఆలయ పరిసరాల్లో పల్లకి సేవ నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పల్లకి సేవలో భక్తుల నామస్మరణలు, భజనలు మార్మోగాయి. ఉదయం నుంచే గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి శ్రీ వేణుగోపాల స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దీంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యక్రమాలను సజావుగా నిర్వహించారు.

## విద్యార్థిని పూజితను అభినందించిన సీఐ

మధిర సెప్టెంబర్ 4 ప్రభాతవా ర్త



ఎంబిబిఎస్ లో సీటు సాధించిన హోంగార్డు కూతురు పూజిత ను పట్టణ సీఐ దోమల రమేష్ అభినందించారు. మధిర టౌన్ పోలీస్ స్టేషన్ నందు డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్న మడుపల్లి వాసి పి మురళి కుమార్తె సిద్దిపేట మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ నందు సీటు సాధించింది. ఈ సందర్భంగా మధిర టౌన్ పోలీస్ స్టేషన్లో శుక్రవారం సిఐ రమేష్, ఎస్సై కిషోర్ పూజితకు అభినందనలు తెలిపారు. కృషి పట్టుదలతో అతి సామాన్య కుటుంబం నుండి ఎంబిబిఎస్ నందు సీటు సాధించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మునుముందు కూడా అనేక విజయాలు సాధించి ఉన్నత స్థాయిలో ఉండి కన్నవారికి ఉన్న ఊరికి మంచి పేరు తీసుకొని రావాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## చైల్డ్ లేబర్ షార్ట్ ఫిలిం విడుదల చేసిన సిఐ మధు



మధిర సెప్టెంబర్ 4 ప్రభాతవా ర్త

మధిర రూరల్ సర్కిల్ పరిధిలోని బోనకల్ మండలం రాయన్నపేట గ్రామానికి చెందిన యువ నటుడు ప్రవీణ్ చిన్నా డైరెక్షన్ లో చేసిన షార్ట్ ఫిలిం చైల్డ్ లేబర్ ని మధిర సీ.ఐ డి. మధు తెలుగు అబ్బాయి చిన్నా యూట్యూబ్ ఛానల్ లో విడుదల చేశారు. సి.ఐ షార్ట్ ఫిలిం వీక్షించి, చిన్నపిల్లలతో పని చేయించడం అనేది నేరం అనే కాన్సెప్ట్ ని మూడు నిమిషాలలో చాలా అద్భుతంగా చూపించారని, ఆర్టిస్ట్ లు అందరు చాలా బాగా చేశారని నటుడు ప్రవీణ్ చిన్నా ని, ప్రశంసించారు. అలాగే ఈ కార్యక్రమంలో ఆదిమూలం పుల్లారావు , ఎస్.కె మీరా డా. పర్వతం లక్ష్మి ప్రకాష్ పాల్గొన్నారు. ఈ చిత్రం లో సత్తుపల్లి కి చెందిన రాధాకృష్ణ ఇనపనూరి, గౌతమ్ కాంతారావు తదితరులు కీలకపాత్రలు పోషించారు...

వార్త



# అద్భుతంగా ప్రజా ప్రభుత్వ పాలన



## కాంగ్రెస్‌ను చూసి బీఆర్ఎస్ ఓర్వలేక అబద్ధాలు

### పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 04:** అద్భుతంగా ప్రజా ప్రభుత్వ పాలన రాష్ట్రంలో కొనసాగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం మణుగూరులోని డీవీఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష హోదాలో ఉండి కూడా ప్రజల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కెసిఆర్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు దుర్వినియోగం చేసి, ధనిక తెలంగాణను అప్పుల పాలు చేసిందని మండిపడ్డారు. కవిత చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ , హరీష్ రావులు సమాధానం చెప్పాలని, ఆమె ఇంటి నుంచి ఎందుకు బయటకు వచ్చిందో ప్రజలకు వివరించాలని సవాల్ విసిరారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ కు గతంలో వచ్చిన సీట్లు కూడా రావని, తెలంగాణలో రెండోసారి కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధిలో లో దూసుకెళ్తోంది అన్నారు. ఇప్పటికే ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుతమైన పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. అమలవుతున్న పథకాలను చూసి తట్టుకోలేక టిఆర్ఎస్ నాయకులు అబద్ధాలు మాట్లాడుతున్నారు, రోడ్లెక్కి గోల పెడుతున్నారని, ప్రజలు అన్నిటిని గమనిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. ప్రజలకు నచ్చే విధంగా అందరూ మెచ్చే విధంగా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వ పాలన కొనసాగుతుందన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం వచ్చి వెయ్యి రోజులు అవుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా, మణుగూరు మండల, పట్టణం కాంగ్రెస్ నాయకులు పీరినాకి నవీన్, కురం రవి, పాలమూరు రాజు, దొబ్బల వెంకటప్పయ్య, సామ శ్రీనివాసరెడ్డి, శివ సైదులు, సౌజన్య, గాండ్ల సురేష్, గణేష్ రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# ముకుందా.....ముకుందా..



## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 04:** మణుగూరులోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని శ్రీకృష్ణుడిని ప్రార్థించారు. అనంతరం ఆలయ సమీపంలో రూపుదిద్దుకుంటున్న నూతన కళ్యాణ మండపం నిర్మాణ పనులను ఎమ్మెల్యే పాయం పరిశీలించారు. పనుల పురోగతిని నిర్వాహకులను అడిగి తెలుసుకుంటూ, నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, టౌన్, జిల్లా, రాష్ట్ర నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ అర్చకులు, నిర్వాహకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# కమిషన్ల జాతరకు తెర లేపిన కాంగ్రెస్ సర్కార్



## సంక్షేమ పథకాలకు పాతరేసిన కాంగ్రెస్ పాలన

### కలెక్టరేట్ ఎదుట వంటవార్పు... ధ్వజమెత్తిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**కొత్తగూడెం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల నయవంచన పాలనకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఆఫీస్ వద్ద వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ కార్యక్రమనీ కి ముఖ్య అతిథులు గా కొత్తగూడెం నియోజకవర్గ ఇన్చార్జ్ వనమా వెంకటేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ... రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తుందని, ఎన్నికల ముందు అలువు కానీ హామీ లను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 420 వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమై, ఆడపిల్లలకు 2500 రూపాయలు ఇస్తానని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, అదేవిధంగా రైతులకు రుణమాఫీ, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలను అమలు చేయడంలో విఫలమైందని మా బిఆర్ఎస్ ప్రభుత్వం కెసిఆర్ నాయకత్వం లో సకల జనుల ప్రజలు సంతోషంగా ఉంటే ఇప్పుడు ఈ ధగ కోరు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజల అష్ట కష్టాలు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరవాలని వారి యొక్క దుష్ట పాలనను ప్రజలకు తెలియాలని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, కేటీఆర్ ఆదేశానుసారం శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ముందు వేలాదిమంది ప్రజలు, రైతులు,బిఆర్ఎస్ పార్టీ నాయకుల తో వంట వార్పు కార్యక్రమం నిర్వహించినారు. ఈ యొక్క కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచ్, మాజీ ఉప సర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు వేల సంఖ్యలో పాల్గొన్నారు.



# అక్షరానికి "ఆచార్యుడు"... భవిష్యత్తుకు "మార్గదర్శి"!

**మార్కులు నేర్పేవాడు ఉపాధ్యాయుడు కాదు...**

**మనిషిగా మలిచేవాడే నిజమైన గురువు**

**అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానజ్యోతులను వెలిగించే మహాశక్తి ఉపాధ్యాయుడిదే**

**తరగతి గది నాలుగు గోడల మధ్యే రేపటి సమాజం... దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న గురువులు**




**ఇల్లందు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త**

ఒక దేశ భవిష్యత్తు పార్లమెంట్‌లో కాదు... తరగతి గది నాలుగు గోడల మధ్యే రూపుదిద్దుకుంటుంది." ఆ నాలుగు గోడలకు ప్రాణం పోసేది గురువు చేతిలో సుద్దముక్క ముందర నల్లబల్ల... ఎదురుగా అమాయకపు చూపులతో కూర్చున్న విద్యార్థులు... అక్కడే ఒక తరం రూపుదిద్దుకుంటుంది. అక్కడే రేపటి శాస్త్రవేత్తలు, వైద్యులు, ఇంజినీర్లు, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, సైనికులు, కళాకారులు, సామాజిక సేవకులు తయారవుతారు. అందుకే ఉపాధ్యాయుడు ఒక ఉద్యోగి కాదు... సమాజ భవిష్యత్తును మలిచే శిల్పి.భారతీయ సంస్కృతిలో గురువుకు లభించిన స్థానం అసాధారణం. సృష్టికి ప్రతీక బ్రహ్మ, పరిరక్షణకు ప్రతీక విష్ణువు, మార్గనిర్దేశనకు ప్రతీక మహేశ్వరుడు... ఈ మూడు తత్వాల సమాహారమే గురువు అనే భావన మన సంస్కృతిలో పాతుకు పోయింది. గురుర్ బ్రహ్మ... గురుర్ విష్ణుః... గురుర్ దేవో మహేశ్వరః" అంటూ గురువును సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపంగా ఆరాధించిన గొప్ప సంప్రదాయం మనది.అందుకే ఉపాధ్యాయ దినోత్సవం కేవలం ఒక వేడుక కాదు... గురువు విలువను, విద్యా వ్యవస్థ బాధ్యతను, సమాజ భవిష్యత్తును మనం పునరాలోచించుకునే పవిత్రమైన సందర్భం.

**పుస్తకాన్ని మాత్రమే కాదు జీవితాన్ని చదివించేవాడే గురువు!**

తల్లిదండ్రులు బిడ్డకు జన్మనిస్తే... ఆ జన్మకు అర్థాన్ని నేర్పేది గురువు. అక్షరాలను పరిచయం చేయడం విద్యలో తొలి మెట్టు మాత్రమే. ఆ అక్షరాల వెనుక ఉన్న ఆలోచనను, ఆలోచన వెనుక ఉన్న బాధ్యతను, జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను ఎదుర్కొనే ధైర్యాన్ని నేర్పడమే నిజమైన విద్య.మంచి మార్కులు సాధించడం విద్యార్థి విజయానికి ఒక ప్రమాణం కావచ్చు. కానీ మంచి మనిషిగా ఎదగడం అతని జీవిత విజయానికి అసలైన ప్రమాణం.విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వెలికి తీయడం... ఓటమి ఎదురైనప్పుడు కుంగిపోకుండా ధైర్యం నింపడం... విజయం వచ్చినప్పుడు అహంకారానికి తావులేకుండా వినయాన్ని నేర్పడం... తప్పు చేసినప్పుడు సరిదిద్దడం... సరైన మార్గం ఎంచుకునేలా చేయడం... ఇవన్నీ గురువు మాత్రమే చేయగలిగే మహత్తర సేవలు.నిజానికి ఉపాధ్యాయుడు పాఠ్యపుస్తకంలోని పాఠాలను ముగించేవాడు కాదు... విద్యార్థి జీవితంలోని ఎన్నో అధ్యాయాలకు దిశానిర్దేశం చేసేవాడు.సాంకేతికత సమాధానమిస్తేగురువు సరైన ప్రశ్నను నేర్పుతాడు!నేడు ప్రపంచం సాంకేతిక విప్లవం వైపు పరుగులు తీస్తోంది. కృత్రిమ మేధస్సు, చరవాణి, ఇంటర్నెట్ ద్వారా ప్రపంచంలోని అపారమైన సమాచారం క్షణాల్లో మన ముందుకొస్తోంది. ఒకప్పుడు పుస్తకాల కోసం గ్రంథాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు ప్రపంచ జ్ఞానం చేతిలోని చరవాణిలోనే అందుబాటులోకి వచ్చింది.అయితే సమాచారం పెరగడం విజ్ఞానం పెరగడమే కాదు యంత్రాలు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వగలవు కానీ ఏ సమాధానం సరైనదో నిర్ణయించే విచక్షణను ఇవ్వలేవు సాంకేతికత సమాచారం అందించగలదు కానీ ఆ సమాచారాన్ని మానవీయ విలువలతో ఎలా ఉపయోగించాలో నేర్పలేదు.చరవాణి జ్ఞానాన్ని చూపగలదు కానీ మనిషిగా ఎలా జీవించాలో చెప్పలేదు. కృత్రిమ మేధస్సు ఆలోచనలకు తోడ్పడగలదు... కానీ మనస్సాక్షి మాట వినాలని, ఇతరుల బాధను అర్థం చేసుకోవాలని, తప్పును తప్పుగా గుర్తించాలని నేర్పేది గురువు.అందుకే సాంకేతికత ఎంత ఎదిగినా... గురువు అవసరం మాత్రం ఎప్పటికీ తగ్గదు.

**మార్కుల వేటలో బాల్యం విలువల కోసం వెతుకుతున్న సమాజం!**

నేటి విద్యా వ్యవస్థలో మార్కులు, ర్యాంకులు, పోటీ పరీక్షలు విద్యార్థుల జీవితంలో కీలకంగా మారాయి. తల్లిదండ్రుల ఆశలు... పాఠశాలల పోటీ సమాజపు అంచనాలు వీటి మధ్య బాల్యం ఒత్తిడికి గురవుతోంది."ఎన్ని మార్కులు వచ్చాయి?" అనే ప్రశ్నకు ముందు"ఏం నేర్చుకున్నావు?" అనే ప్రశ్న రావాలి.ర్యాంకు సాధించిన విద్యార్థి విజేత కావచ్చు కానీ విలువలు కోల్పోయిన సమాజం మాత్రం విజేత కాదు.మంచి మార్కులతో పాటు మంచి మనసు ఉండాలి. విద్యతో పాటు వినయం ఉండాలి. తెలివితో పాటు బాధ్యత ఉండాలి. విజయంతో పాటు మానవత్వం ఉండాలి. చదువుతో పాటు పెద్దలను గౌరవించే సంస్కారం, ప్రకృతిని కాపాడే బాధ్యత, సమాజం పట్ల నిబద్ధత పెరగాలి.ఇలాంటి సమగ్ర వ్యక్తిత్వాన్ని నిర్మించడంలో గురువు పాత్ర అత్యంత కీలకం.

పిల్లల భవిష్యత్తును కేవలం పాఠశాలలకే అప్పగించడం తల్లిదండ్రుల బాధ్యత నుంచి తప్పించుకోవడమే అవుతుంది. పాఠశాల విద్యను అందిస్తే... కుటుంబం సంస్కారాన్ని అందించాలి.తల్లిదండ్రులు ఉపాధ్యాయులను గౌరవిస్తేనే పిల్లల్లో గురు గౌరవం పెరుగుతుంది. గురువుపై గౌరవం అంటే కేవలం వ్యక్తిపై గౌరవం కాదు విద్యపై, జ్ఞానంపై, క్రమశిక్షణపై, జీవితాన్ని మార్చే మార్గదర్శకత్వంపై గౌరవం. ఇంట్లో తల్లిదండ్రుల మాట బడిలో గురువు బోధన ఈ రెండూ కలిసినప్పుడే ఒక విద్యార్థి సంపూర్ణ వ్యక్తిత్వంతో ఎదగగలడు.

**మారుతున్న కాలంలో... పెరుగుతున్న గురువు బాధ్యత!**

విద్యా విధానాల్లో మార్పులు సాంకేతిక పరిజ్ఞానం వేగవంతం కావడం విద్యార్థుల ఆలోచనా విధానంలో మార్పులు పరిపాలనా బాధ్యతలు సామాజిక ఒత్తిళ్ల ఇలా అనేక సవాళ్ల మధ్య ఉపాధ్యాయులు తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.తరగతి గదిలో పాఠాలు చెప్పడం మాత్రమే వారి పని కాదు. విద్యార్థుల మానసిక స్థితిని అర్థం చేసుకోవడం, వారి ప్రతిభను గుర్తించడం, వెనుకబడిన వారిని ముందుకు తీసుకురావడం, సమాజ మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడం కూడా గురువుల బాధ్యతగా మారింది.అందుకే గురువుల నుంచి ఫలితాలను మాత్రమే ఆశించకుండా వారు ఎదుర్కొంటున్న సవాళ్లను కూడా సమాజం అర్థం చేసుకోవాలి.

**ఒక్క గురువు వెలిగించే దీపం వేల జీవితాలకు వెలుగు!**

ఒక గురువు చేతిలోని సుద్దముక్కతో గీసే ఒక్క అక్షరం ఒక విద్యార్థి జీవితాన్ని మార్చవచ్చు. ఒక చిన్న ప్రోత్సాహపు మాట ఓటమితో కుంగిపోయిన విద్యార్థిలో కొత్త ఆశను నింపవచ్చు. ఒక సరైన సలహా జీవితాంతం దారి చూపవచ్చు ఎంతటి విజయవంతమైన వ్యక్తి వెనుక చూసినా ఎక్కడో ఒకచోట ఒక గురువు ముద్ర తప్పకుండా కనిపిస్తుంది.అందుకే గురువు బోధనకు కొలమానం జీతం కాదు ఆయన తీర్చిదిద్దిన విద్యార్థుల జీవితాలే గురువు తరగతి గదిలో వందమందికి బోధిస్తాడు కానీ ఆయన బోధన ప్రభావం తరాల మీద పడుతుంది విద్యార్థులకు గురు సందేశం ప్రశ్నించడం ఆపొద్దు, నేర్చుకోవడం మానొద్దు!విద్యార్థులారా గురువు చెప్పిన ప్రతి మాటను మూసగా అనుసరించడం కాదు దాని వెనుక ఉన్న జ్ఞానాన్ని అర్థం చేసుకోవాలి. ప్రశ్నించండి సందేహించండి తెలుసుకోండి కొత్త విషయాలను నేర్చుకోండి గురువును గౌరవించడం అంటే కేవలం నమస్కరించడం కాదు... ఆయన అందించిన జ్ఞానాన్ని జీవితం లో ఆచరించడం.తల్లిదండ్రులకు కూడా ఒక బాధ్యత ఉంది. పిల్లలకు ఖరీదైన పుస్తకాలు, ఆధునిక సాంకేతిక పరికరాలు అందించడంతో పాటు గురువును గౌరవించే సంస్కారాన్ని, జ్ఞానాన్ని ఆరాధించే మనస్తత్వాన్ని, సమాజం పట్ల బాధ్యతను నేర్పాలి.

**గురువు... ఉద్యోగం కాదు, యజ్ఞం!**

ఉపాధ్యాయ వృత్తి సాధారణ ఉద్యోగం కాదు. అది ఒక పవిత్రమైన బాధ్యత. ఒక తరాన్ని తీర్చిదిద్దే యజ్ఞం. ఒక విద్యార్థి జీవితంలో వెలిగించిన జ్ఞానదీపం రేపు వందలాది, వేలాది జీవితాలకు వెలుగునివ్వగలదు.గురువు చేతిలోని అక్షరం కేవలం అక్షరం కాదు అది ఒక ఆలోచనకు బీజం. ఆయన చెప్పే మాట కేవలం మాట కాదు అది ఒక జీవితానికి మార్గదర్శకం. ఆయన ఇచ్చే ప్రోత్సాహం కేవలం ఓదార్పు కాదు అది ఒక భవిష్యత్తుకు పునాది.అందుకే గురువులను గౌరవించడం అంటే భవిష్యత్తును గౌరవించడం. విద్యను గౌరవించడం అంటే సమాజ భవిష్యత్తును గౌరవించడం.ఈ గురు పూజోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవం సం దర్భంగా అక్షర జ్ఞానాన్ని అందించి అజ్ఞానాంధకారాన్ని తొలగించి విద్యార్థుల జీవితాలకు దిశానిర్దేశం చేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడికి 'ప్రభాత వార్త' హృదయపూర్వక పాదాభివందనాలు తెలియ జేస్తోంది. గురువులను గౌర విద్దాం... జ్ఞానాన్ని ఆరా ధిద్దాం... విలువలతో కూడిన సమసమాజాన్ని నిర్మిద్దాం!

# ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో నేటి నుంచి ప్రచార కార్యక్రమాలు

## జిల్లా కలెక్టర్ అంకిత్ వెల్లడి



**కొత్తగూడెం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అక్టోబర్ 1న అర్హత తేదీగా తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్2026)లో భాగంగా క్లెయిమ్స్, అభ్యం తరాల స్వీకరణ కోసం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఈనెల 5,6, 12, 13 తేదీలలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించబడతాయని కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్లు సంబంధిత పోలింగ్ స్టేషన్‌లో అందుబాటులో ఉంచిన ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించి, పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే లేదా కొత్తగా పేరు నమోదు, తొలగింపు, మార్పులు అవసరమైతే నిర్ణీత ఫారం6, ఫారం7 మరియు ఫారం8 ద్వారా సంబంధిత బిఎల్ఓ/ఈఆర్ఓ లకు క్లెయిమ్స్, అభ్యంతరాలు సమర్పించవచ్చు. ప్రత్యేక ప్రచార దినాల్లో సంబంధిత బిఎల్ఓ లు తప్పనిసరిగా అందుబాటులో ఉంటారు. కావున, జిల్లాలోని ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ వివరాలను పరిశీలించుకోవాలని ఆయన కోరారు.

# రోజుకు 1.90 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించాలి

## సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశం



**కొత్తగూడెం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**

పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇంధన సరఫరా ఒప్పందం గల థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా చేయడానికి సింగరేణిలో రోజుకు 1.9 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని సింగరేణి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో నుంచి ఆయన సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో శుక్రవారం బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి కార్యాలయం, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, అలాగే రాష్ట్ర ఇంధన శాఖ వారు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గును అందించాలంటూ, సమీక్షలు నిర్వహించి లక్ష్యాలను నిర్దేశిస్తున్నారని, దేశ ఇంధన భద్రత రీత్యా తగినంత బొగ్గును అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ బొగ్గు ఉత్పత్తి సంస్థల పైన ఉంది కాబట్టి సింగరేణి కూడా శక్తి వంచన లేకుండా కృషిచేసి బొగ్గు ఉత్పత్తి, రవాణా పెంచాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఆయన ఏరియాల వారీగా ఇప్పటివరకు ఇవ్వబడిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిని సమీక్షించారు. బొగ్గు ఉత్పత్తి, రవాణాతోపాటు ఓవర్ బర్డెన్ తొలగింపు పై కూడా ఛైర్మన్ సమీక్షించారు. ఆగస్టు నెలాఖరి వరకు ఆఫ్ లోడింగ్ ద్వారా 1,315 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబిని తొలగించడం జరిగిందని, అయితే ఇచ్చిన లక్ష్యాలలో ఇది 95 శాతం మాత్రమే కనుక నూరు శాతం పైబడి ఓవర్ బర్డెన్ తొలగించడానికి ఆఫ్ లోడింగ్ ఏజెన్సీ లను సమాయత్తం చేయాలని ఆదేశించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టిన ఈ సమయం ఉత్పత్తికి అనుకూలంగా ఉంది కనుక రోజువారీ లక్ష్యాలను దాటి బొగ్గు ఉత్పత్తి సాధించాలని, రైల్వే విభాగం వారితో సమన్వయం జరుపుతూ నూరు శాతం పైబడి బొగ్గు రవాణా సాధించాలన్నారు. రక్షణా ప్రమాణాలు పాటిస్తూ తగిన నాణ్యత గల బొగ్గును సరఫరా చేయడానికి పై అధికారుల నుండి కింది వరకు సమష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్ మరియు ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎమ్. తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్ మెంట్) బి. వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ !! మార్కెటింగ్) టి. శ్రీనివాస్, కార్పోరేట్ జనరల్ మేనేజర్లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

# నిధులు ఉన్నా.. పనుల్లో మాత్రం జాప్యం!

## పాల్వంచ సాంఘిక సంక్షేమ గురుకులంలో మౌలిక వసతుల సమస్యలు





**పాల్వంచ టౌన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** నిధులు మంజూరవుతున్నా.. మౌలిక వసతుల సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతుండటంపై పాల్వంచ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ముఖ్యంగా మరుగుదొడ్ల తలుపులు దెబ్బతినడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో మొత్తం 60 మరుగుదొడ్లు ఉండగా, గతేడాది సుమారు 2,500 మంది విద్యార్థులు పాల్గొన్న క్రీడా పోటీల సందర్భంగా పీవీసీ తలుపులు దెబ్బతిన్నట్లు పాఠశాల వర్గాలు తెలిపాయి. గతంలో 24 తలుపులు ఏర్పాటు చేయగా, ప్రస్తుతం మరో 30 తలుపులను మార్చాల్సిన అవసరం ఏర్పడింది. పాఠశాల నిర్వహణకు నెలకు రూ.30 వేల నిధులు మంజూరవుతున్నప్పటికీ, అవసరమైన పనులు పూర్తికాక పోవడంపై తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇక కంపౌండ్ వాల్, డ్రైనేజీ, భద్రత తదితర సమస్యలపై కలెక్టర్‌కు రెండు సార్లు వినతిపత్రాలు సమర్పించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మున్సిపల్ డీఈ పరిశీలించి కొలతలు తీసుకున్నారని, ఎమ్మెల్యే, సంబంధిత అధికారుల దృష్టికి కూడా సమస్యలను తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. మరుగుదొడ్ల తలుపుల మరమ్మతులకు చర్యలు చేపట్టామని, వర్కర్ అందుబాటులోకి వచ్చిన వెంటనే పనులు ప్రారంభించి సోమవారం నాటికి పూర్తి చేస్తామని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. అయితే మిగిలిన మౌలిక వసతుల సమస్యలు ఎప్పుడు పరిష్కారమవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థుల సౌకర్యం, ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన పనులను ఇకనైనా అధికారులు వేగవంతం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



**మణుగూరు , ప్రభాతవార్త, సెప్టెంబర్ 04:**

ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు . మణుగూరు మండలం అశోక్ నగర్‌లో శుక్రవారం బీఆర్ఎస్ పోరుబాట కార్యక్రమంలో భాగంగా వృద్ధులు, దివ్యాంగులు, మహిళల సదస్సు, నిరసన చేపట్టారు. వృద్ధులు, మహిళలకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ హామీలను నెరవేర్చలేదని, కేవలం ఉచిత బస్సు ప్రయాణానికే పరిమితమై మిగిలిన సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. బాధితులకు వెంటనే సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ పోశం నరసింహారావు, కుంట లక్ష్మణ్, ముత్యం బాబు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**.పినపాక, ప్రభాత వార్త, సెప్టెంబర్ 04.**

కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని ఇ బయ్యారం గ్రామంలో గల సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పుష్పాలతో సుందరంగా అలంకరించి ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు, అర్చనలు చేపట్టారు. భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారికి తులసి పూజ నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కృష్ణాష్టమి వేడుకలతో ఆలయ ప్రాంగణం భక్తి శ్రద్ధలతో సందడిగా మారింది. అదేవిదంగా గోపాలరావుపేట గ్రామంలో యాదవ కులస్తుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు, యువతీ యువకులు, చిన్నారులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక రామాలయం, ముత్యాలమ్మ ఆలయాలతో పాటు గ్రామంలోని వీధుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. కృష్ణాష్టమి సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో పాటు పండుగ శోభ సంతరించుకుంది. గ్రామస్థులంతా ఒకచోట చేరి వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్టి కొట్టే వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ పెద్దలు, యువత, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి
### మాజీ ఎం పి పి రేసులక్ష్మి

**దుమ్ముగూడెం: ప్రభాతవార్త (సెప్టెంబర్ 4)**

ఎన్నికల్లో మహిళకు ఇచ్చిన వాగ్దానాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని లేకుంటే మహిళల ఉసురు తగిలి కాంగ్రెస్ ప్రభుత్వం కనుమరుగు కాక తప్పదని మాజీ ఎంపీపీ డి ఆర్ ఎస్ పార్టీ మహిళా నాయకురాలు రేసులక్ష్మీ హెచ్చరించారు బి ఆర్ ఎస్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మహిళకు ఇచ్చిన వాగ్దానాల బాకీ కార్డులను లక్ష్మీ నగరం గ్రామంలో మహిళలకు పంపిణీ చేస్తూ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు కోసం 6 గ్యారెంటీలు 420 అబద్ధపు హామీలు వాగ్దానాలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని 1000 రోజులు దాటినా అమలు చేయలేదని మహిళకు నెలకు 2500 రూపాయలు విద్యార్థినులకు స్కూటర్లు పెళ్లి కుమార్తెకు తులం బంగారం వంటగ్యాస్ 500 లకే లాంటి వాగ్దానాలు హామీలను తక్షణమే ప్రతీ ఒక్కరికి అందించాలని డిమాండ్ చేశారు పేద ప్రజలకు అడక్కుండానే అనేక సంక్షేమ పథకాలను గత ముఖ్యమంత్రి కెసిఆర్ అమలు చేస్తే వాటిని రద్దు చేయడానికి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు పేదల మహిళలకు ఇచ్చిన హామీలు ఇవ్వకుంటే వారి ఆగ్రహంతో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ దుమ్ముకొట్టుకు పోతుందని ఆమె హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కన్వీనర్ కణితి రాముడు కో కన్వీనర్ జానీ పాషా నాయకులు తంతరపల్లి వెంకటేశ్వరరావు వాగే కృష్ణ సొంపాక మంగయ్య కుంజ గౌరమ్మ సోడి రాణి జట్ల రమణ సొంపాక తిరుపతమ్మ సొంపాక లక్ష్మీ కనకమ్మ కణితిరమాదేవి మడకంలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు



## సింగరేణి హెల్త్ క్యాంప్



**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 04:**

సింగరేణి సేవా సమితి, వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మణుగూరు మండలం రామానుజవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 101 మంది గ్రామస్తులు వైద్య సేవలు పొందారు.

ఈ సందర్భంగా ఏరియా హాస్పిటల్ డాక్టర్ టి. సౌజన్య మాట్లాడుతూ.. బాధితులకు బిపి, షుగర్ మరియు సీజనల్ వ్యాధుల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి వడబోసిన నీటినే తాగాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ యు. భవాని, సేవా సమితి కోఆర్డినేటర్ కె.వి. మారేశ్వర రావు, ఆసుపత్రి సిబ్బంది జి. నాగసాయి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సేవలు సమాజానికి మార్గదర్శకం పినపాక ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 04:**



ఈ నెల 5న నిర్వహించనున్న ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనా సిబ్బందికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలోఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని అన్నారు. పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, దేశభక్తిని పెంపొందించడంలో వారి కృషి అభినందనీయమని పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జరుపుకునే ఈ రోజు, సమాజ నిర్మాణంలో గురువుల గొప్పతనాన్ని గుర్తుచేస్తుందని తెలిపారు. పినపాక నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి, మెరుగైన విద్యా అవకాశాల కల్పనకు తన వంతు కృషి నిరంతరం కొనసాగిస్తానని ఎమ్మెల్యే పాయం తెలిపారు.

మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి.పినపాక, ప్రభాత వార్త, సెప్టెంబర్ 04.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ మహిళా నాయకులు మండల కేంద్రంలో నిరసన చేపట్టారు.కేటీఆర్ ఆదేశాల మేరకు,మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపుతో మండల అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు 2,500 రూపాయలు,కళ్యాణ లక్ష్మి తో పాటు తులం బంగారం,డ్వాక్రా రుణాలు,వృద్ధులు, దివ్యాంగుల పింఛన్ల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.హామీలు అమలు చేయకపోతే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.




## ముకుందా.....ముకుందా...శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే పాయం



**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 04:**

మణుగూరులోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల



స్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని శ్రీకృష్ణుడిని ప్రార్థించారు.అనంతరం ఆలయ సమీపంలో రూపుదిద్దుకుంటున్న నూతన కళ్యాణ మండపం నిర్మాణ పనులను ఎమ్మెల్యే పాయం పరిశీలించారు. పనుల పురోగతిని నిర్వాహకులను అడిగి తెలుసుకుంటూ, నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, టౌన్, జిల్లా, రాష్ట్ర నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ అర్చకులు, నిర్వాహకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## సింగరేణి మాజీ ఉద్యోగులు సీ పీఎంఆర్ఎస్ కార్డులను రెన్యువల్ చేసుకోవాలి

**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్04:**



సింగరేణి సంస్థలో పనిచేసి పదవీ విరమణ పొందిన మాజీ ఉద్యోగులు తమకు వైద్య సేవలు నిరాటంకంగా అందాలంటే సీపీఆర్ఎంఎస్ హెల్త్ కార్డులను వెంటనే రెన్యువల్ చేసుకోవాలని మణుగూరు ఏరియా ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేశ్ కోరారు. ఆయన శుక్రవారం విలేకరుల తో మాట్లాడారు. మణుగూరు ఏరియాలో జారీ చేసిన 4,448 కార్డుల్లో 4,221 రెన్యువల్ కాగా, ఇంకా 227 కార్డులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సదరు మాజీ ఉద్యోగులు లైఫ్ సర్టిఫికేట్ సమర్పించి వెంటనే కార్డులను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. 2027 సంవత్సరానికి గాను లైఫ్ సర్టిఫికేట్‌ను నవంబర్ నెలలో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సర్టిఫికేట్‌ను మొబైల్‌లోని జీవన్ ప్రమాణ్, ఆధార్ ఫేస్ ఆర్డీ యాప్‌ల ద్వారా ఇంటి వద్ద నుంచే లేదా సమీపంలోని మీసేవా కేంద్రాల ద్వారా సమర్పించవచ్చని పేర్కొన్నారు. దీని ద్వారా భార్యాభర్తలిద్దరూ సులభంగా సర్టిఫికేట్ పూర్తి చేయవచ్చన్నారు. వివరాలకు సంబంధిత గనులు, డిపార్ట్‌మెంట్లు, సంక్షేమాధికారి కార్యాలయం లేదా జీఎం ఆఫీస్‌లోని ఏటీబీ సెల్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల దగా పాలనపై సమరభేరి

### వంటా-వార్పుతో మహిళల ఆగ్రహజ్వాల.. హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన భారత రాష్ట్ర సమితి

**ఇల్లందు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా భారత రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఇల్లందు పట్టణం గురువారం రాజకీయ వేడితో మార్మోగింది. జగదాంబ సెంటర్‌లోని తెలంగాణ తల్లి చౌరస్తా వేదికగా నిర్వహించిన సమరభేరి కార్యక్రమంలో మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని వంటా-వార్పు నిర్వహిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద మహిళలు రోడ్డుపైనే పొయ్యిలు వెలిగించి వంటలు చేస్తూ నిరసన తెలపడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో మహిళలు, రైతులు, యువత, వృద్ధులు, దివ్యాంగులు, నిరుద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలను నిరాశపరిచిందంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ప్రజల ఆకాంక్షలను నెరవేర్చని ప్రభుత్వం వద్దిరాజు రవిచంద్రరాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల అమలుపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. మహిళలకు నెలకు రూ.2,500, రైతులకు రుణమాఫీ, యువతకు ఉపాధి, సామాజిక భద్రత పథకాల అమలు వంటి హామీలు ఎక్కడ అమలయ్యాయని ప్రశ్నించారు. మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి



ఇప్పుడు హామీలను విస్మరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ప్రజల సమస్యలపై పోరాడే పార్టీగా భారత రాష్ట్ర సమితి ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. మహిళల ఓట్లతో గెలిచి మహిళలకే అన్యాయం బానోత్ హరిప్రియ నాయక్మాజీ శాసనసభ్యురాలు బానోత్ హరిప్రియ నాయక్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మహిళల ఆశలు, ఆత్మగౌరవాన్ని నమ్మించి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు వారినే మోసం చేసిందన్నారు. ప్రతి ఇంట్లో అర్హులైన మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని ఇచ్చిన హామీ అమలు కాకపోవడం మహిళల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.కళ్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రకటించి, ఇప్పుడు ఆ పథకాల భవిష్యత్తునే ప్రశ్నార్థకంగా మార్చారని ఆరోపించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెంచుతామని చెప్పిన పెన్షన్లు ఇప్పటికీ అందకపోవడం ప్రజలను మోసం చేసినట్లేనన్నారు.

మహిళలకు ఇచ్చిన ప్రతి హామీ అమలయ్యే వరకు భారత రాష్ట్ర సమితి ఉద్యమం ఆగదని, ఈ సమరభేరి రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమంగా మారుతుందని హెచ్చరించారు. హామీల అమలు కోసం ఉద్యమం మరింత ఉధృతం దిండిగాల రాజేందర్భారత రాష్ట్ర సమితి వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్ మాట్లాడుతూ,



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీలతో ప్రజలను ఆకర్షించి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు వాటిని పూర్తిగా మరచిపోయిందన్నారు. వెయ్యి రోజుల పాలన ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురాలేదని, ప్రజా సమస్యలను పక్కనపెట్టి ప్రచార రాజకీయాలకు పరిమితమైందని విమర్శించారు. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు హామీల అమలు కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.వంటా వార్పు కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఖాళీ పాత్రలు, పొయ్యిలతో నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమాన్ని విస్మరించిందంటూ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో తెలంగాణ తల్లి చౌరస్తా మార్మోగింది.

ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని నాయకులు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, మహమ్మద్ అబ్దుల్ జబ్బార్, తెలంగాణ ఉద్యమ నాయకుడు లకావత్ దేవిలాల్ నాయక్, రంగనాథ్, శీలం రమేష్, మాజీ కౌన్సిలర్లు జేకే శీను, కటకం పద్మావతి, తోట లలిత శారద, యువజన నాయకుడు గిన్నారపు రాజేష్ తో పాటు పట్టణ, మండల నాయకులు, మహిళా కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చంద్రబాబును కలిసిన ఇల్లందు టీడీపీ నాయకులు

**ఇల్లందు అర్బన్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:**

ఇల్లందు పట్టణం 1వ వార్డుకు చెందిన బాసాని నాగేశ్వరరావును కుటుంబ సభ్యులతో కలిసి టీడీపీ ఇల్లందు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును అమరావతి సచివాలయంలో కలిశారు. నాలుగు నెలల క్రితం ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావును గతంలో ఫోన్‌లో పరామర్శించిన చంద్రబాబు, ఆరోగ్యం కుదుటపడిన తర్వాత తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు అడిగి తెలుసుకుని, పూర్తిగా విశ్రాంతి



తీసుకోవాలని, పార్టీ అండగా ఉంటుందని, ఆర్థికంగా సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. నాగేశ్వరరావు చికిత్సను ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన ముద్రగడ వంశీని అభినందించారు. నూతనంగా ఎన్నికైన విజయలక్ష్మినగర్ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబును అభినందించిన చంద్రబాబు, పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే తప్పకుండా అవకాశాలు వస్తాయని, ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కామేపల్లి సర్పంచ్ అజ్మీర బుజ్జిని కూడా అభినందించారు. తెలంగాణలో టీడీపీని బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని నాయకులు చంద్రబాబును కోరగా, రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు ముద్రగడ వంశీ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కారు నర్సన్న, దాసరి గోపాలకృష్ణ, గోగేలా రాజేష్, బాసాని సుజాత, బాసాని నవీన్, బాసాని సాయి, తమానబోయిన భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో జగన్ కు గౌరవం

**టేకులపల్లి: ప్రభాతవార్త**

జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన టేకులపల్లి మండల విద్యాశాఖ అధికారి ఏ. జగన్ భద్రాద్రి జిల్లాల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఏంపిక అయిన అందరికి తెలంగాణ దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ తరఫున హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ లక్ష్మణ్ తెలిపారు విద్యారంగ అభివృద్ధికి ఏ. జగన్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మండల పరిధిలోని పాఠశాలలను నిరంతరం సందర్శిస్తూ, ఉపాధ్యాయులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ తనదైన శైలిలో సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. తన పర్యవేక్షణలో పాఠశాలల్లో విద్యా ఫలితాలు మెరుగుపడటంతో పాటు 100 శాతం ఫలితాలు సాధించడం అంకితభా వానికి నిదర్శనమని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తూ, ప్రతి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తూ మంచి పేరు సంపాదించుకున్నారని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించు కుని జిల్లా కలెక్టర్ గారి మరియు జిల్లా విద్యా శాఖాధికారి వాసంతి మేడమ్ గారిచేతుల మీదుగా ఉత్తమ ఉపా ధ్యాయ అవా ర్డు అందు కోవడం ఆయన చేసిన సేవలకు లభించిన స ముచిత గౌర వమని పేర్కొన్నారు. ఈ అవార్డు ఆయనకు మరింత ఉత్సాహాన్ని అందించి,



భ విష్యత్తులో విద్యారంగంలో మరిన్ని సేవలు అందించేందుకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. ఏ. జగన్ సేవాభావం, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శం అని బానోత్ లక్ష్మణ్ పేర్కొన్నారు.




## రవికుమార్ ను సన్మానించిన జెకె సివిల్ కార్మికులు



**ఇల్లందు అర్బన్, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త:**

ఇల్లందు ప్రగతి శీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జెకె సివిల్ డిపార్ట్మెంట్లో సింగరేణి సివిల్ డీజీఎం రవికుమార్



ఆర్జీ 3 కి బదిలీ అయ్యారు. కాంట్రాక్టు కార్మికులు, శుక్రవారం పూలమాలలతో శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ యాకుబ్ షావలి, మల్లెల వెంకటేశ్వర్లు కార్యదర్శి పాల్గొని మాట్లాడుతూ సివిల్ డీజీఎం ఈ మూడు సంవత్సరాల కాలంలో అన్ని రంగాల కార్మికుల వారి సమస్యల యెడల వారికున్న పరిధిలో మంచి సహాయ సహకారాలు అందించారని కాంట్రాక్టు కార్మికుల వైద్య పుస్తకాలు గానీ జీతాల చిట్టీలు ఇవ్వడం గానీ కాంట్రాక్టర్లు ప్రతి నెల మొదటి వారంలో జీతాలు అందే విధంగా పర్యవేక్షించే వారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జి రాజేశ్వరి జమున గంగ సుమిత్ర ఎం శ్రీను సాంబు తరుణ్ చిలకమ్మా దుర్గ బాబురావు లీల మంజు విజయ తదితరులు పాల్గొన్నారు.

## శిరీషను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి



**ఇల్లందు అర్బన్, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త:**

ఇల్లందు ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యు ముఖ్య సమావేశం ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం వై. సావిత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి శిరోమణి, చంద్ర అరుణ మహిళా సంఘం రాష్ట్ర హించార్జి పాల్గొని మాట్లాడుతూ ములకలపల్లి మండలానికి చెందిన గిరిజన ఆదివాసీ బిడ్డ ఊకె శిరీష (నర్స్)ను ఐటీడీఏ పీవో ద్వారానే హైదరాబాద్‌లోని తుక్కుగూడలో నర్సుగా చేరింది. ఆగస్టు 24 రాత్రి సమయంలో దుండగులు అత్యంత క్రూరంగా హత్య చేసి చంపడం దారుణమని అన్నారు. శిరీషను హత్య చేసిన దుండగులను వెంటనే అరెస్టు ఫాస్ట్ ట్రాక్ ద్వారా కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. పిఓ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశంలో మహిళలకు రక్షణ లేదని అన్నారు. పని ప్రదేశాలలో మహిళలకు భద్రత కల్పించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో యదలపల్లి సావిత్రి సుజాత పాల్గొన్నారు.

# అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రిలో వైద్యుల ఘనత




## ఒకే రోజు 5 ప్రసవాలు

## అందులో 4 సాధారణ ప్రసవాలు

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 4, (ప్రభాతవార్త):



అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రిలో వైద్యులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. ఒకే రోజులో నాలుగు సాధారణ ప్రసవాలు, ఒక సిజేరియన్ ప్రసవం విజయవంతంగా నిర్వహించి తల్లులు, శిశువులను క్షేమంగా ఉంచారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకుంటున్న గర్భిణులకు మెరుగైన వైద్యం అందిస్తూ.. అత్యవసర పరిస్థితుల్లో కూడా వైద్యులు సమయస్ఫూర్తితో వ్యవహరిస్తున్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా రుక్మిణి తెలిపారు. ఒకే రోజు ఐదుగురు మహిళలకు ప్రసవాలు విజయవంతంగా నిర్వహించడం పట్ల ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తల్లులు, శిశువులు అందరూ ఆరోగ్యంగా ఉన్నారని సూపరింటెండెంట్ వెల్లడించారు. అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపడటానికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, డీసీహెచ్ఎస్ రవి బాబు అందిస్తున్న సహకారం ఎంతో కీలకమని డాక్టర్ రాధా రుక్మిణి తెలిపారు. వారి సహకారంతోనే ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించ గలుగుతున్నామని పేర్కొన్నారు. మరోవైపు ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులు, వారి బంధువులు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటంతో పాటు ప్రసవ సేవలు మెరుగ్గా అందుతున్నాయని వారు తెలిపారు.

## వాటర్ ట్యాంక్ వితరణ

దమ్మపేట, సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త):



మండల పరిధిలోని సీతారాంపురం గ్రామానికి సత్తుపల్లికి చెందిన ఎలఐసి రిటైర్డ్ ఆఫీసర్ శ్రీరాముల సారంగపాణి ఒక వాటర్ ట్యాంక్‌ను శుక్రవారం ప్రారంభించారు. జల్లిపల్లి ఎర్ర రాములు రాధమ్మ వాళ్ళ జ్ఞాపకార్థం వారి కుమారులు జల్లిపల్లి సుబ్బారావు, అప్పారావు, వెంకటేశ్వరావు, రమణల సహకారంతో ఈ వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ వాటర్ ట్యాంక్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన జల్లిపల్లి కుటుంబాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జల్లిపల్లి కిషోర్, గోపాలరావు, సత్యనారాయణ, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## దమ్మపేటలో 1000 రోజుల కాంగ్రెస్ పాలన సంబరాలు

దమ్మపేట, సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త):




కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దమ్మపేట మండల కేంద్రంలో స్థానిక వై.ఎస్.ఆర్ విగ్రహం వద్ద పార్టీ శ్రేణులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కక్కిరాల రమేష్ ఆధ్వర్యంలో కేకు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు కేకు తినిపించుకుంటూ జై కాంగ్రెస్, జై జై కాంగ్రెస్ అంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, అర్హులైన పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు రూ. 2 లక్షల వరకు పంట రుణాల మాఫీ అమలు, రైతులకు పెట్టుబడి సాయం కింద ఆర్థిక సహాయం, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం, వైద్య ఖర్చుల కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు పెంపు, రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతర జారీ, గ్రామాల్లో మౌలిక వసతులు, ప్రభుత్వ ఉద్యోగాల అవకాశం కల్పన తదితర కాంగ్రెస్ ప్రభుత్వం అందించే పథకాల వివరాలు వెల్లడించారు. . ఈ కార్యక్రమంలో పగడాల రాంబాబు, కే.వి. సత్యనారాయణ, చిన్నశెట్టి యుగంధర్, అత్తులూరి వెంకట రామారావు, చిన్నశెట్టి చిట్టిబాబు, గోపి, వనమాల శ్రీనివాసరావు, పగడాల కృష్ణారావు, దేవయ్య, పానుగంటి లక్ష్మణ్ గౌడ్, వేముల శ్రీను, గట్ల సర్వేశ్వరరావు, నాగరాజు, పిట్టల శ్రీనివాసరావు, ఎస్.కే రషీద్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేటలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు!

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త):

అశ్వారావుపేట మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ప్రజలు, భక్తులు శుక్రవారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిర్వహించారు. వేడుకల్లో భాగంగా పట్టణంలోని వివిధ కాలనీలు, వీధులు మరియు ప్రధాన కూడళ్లలో 'ఉట్ల పండుగను కన్నులపండువగా నిర్వహించారు. రంగురంగుల నీళ్ల చల్లుకుంటూ యువకులు, గోపాలుర వేషధారణలోని చిన్నారులు అత్యంత ఉత్సాహంతో పోటీపడి ఉట్లు కొట్టడంతో ఆయా ప్రాంతాలన్నీ కేరింతలతో నిండిపోయాయి. చిన్నారి రాధాకృష్ణుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాయంత్రం వేళల్లో నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచనాలు, భక్తిపాటల నృత్య రూపకాలు, భజన కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### అన్ని వర్గాలను మోసం చేసింది

### కాంగ్రెస్ ప్రభుత్వంలో ముసలం ప్రభుత్వం పడిపోవడం ఖాయం

### కేసీఆర్ ముఖ్యమంత్రి అవడం ఖాయంవంట వార్పు

### నిరసనలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా, వెంకటరమణ

దమ్మపేట రూరల్ సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త :



ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు, అశ్వారావుపేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సర్ ఇంచార్జ్ ఉప్పల వెంకటరమణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ హామీల అమలుపై విఫలమైందని వంట వార్పు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, 6 గ్యారంటీలు ఇచ్చిందని, వాటిలో ఎన్నో హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను ప్రజల ముందు ఉంచి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హామీల అమలులో అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంలో ముసలం...**కాంగ్రెస్ ప్రభుత్వంలో ముసలం మొదలైందని ప్రభుత్వం ఎంతో కాలం నడవదని తొందరలోనే కూలిపోతుందని మాజీ ఎమ్మెల్యే మెచ్చా జోస్యం చెప్పారు. ఎవరు భయపడొద్దు మళ్ళీ మన కేసీఆర్ ముఖ్యమంత్రి అన్నారు.ఒక బీసీ ఆడబిడ్డను మంత్రి పదవి నుంచి తొలగించారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో లా అండ్ ఆర్డర్ అదుపు తప్పిందని, ఎక్కడ చూసినా మానభంగాలు, మర్డర్లు, దోపిడీలు, విపరీతంగా పెరిగిపోయాయని లా అండ్ ఆర్డర్ అరికట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది అన్నారు.

**మంత్రులపై ఆరోపణలు...**ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారని వారు ఒకరిపై ఒకరు పోటీపడి దోచుకుంటున్నారని నియోజకవర్గ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఇన్చార్జి ఉప్పల వెంకటరమణ ఆరోపణలు చేశారు. మంత్రి తుమ్మల ఎన్నికల అఫిడవిట్ లో గతంలో 26 ఎకరాలు 9కుంట్ల భూమి చూపించారని, ఇప్పుడు 36 ఎకరాలు ఎలా వచ్చాయని నిలదీశారు. మీరు మొదట తెలుగుదేశం, బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ లో కొనసాగుతున్నారని కాంగ్రెస్ లోనే ఉంటారా, పార్టీ మారతారా అని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తులు ఎలా సంపాదించారో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మండల స్థాయి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, సర్పంచులు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకులారా ఖబడ్దార్

దమ్మపేట, సెప్టెంబరు 4, (ప్రభాతవార్త):



అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట హెడ్ కోటర్ నందు బిఆర్ఎస్ పార్టీ చేసిన నిరసన కార్యక్రమంలో భాగంగా రాజకీయాలు తెలియని వ్యక్తులు కూడా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు రాష్ట్ర అభివృద్ధి ప్రదాత తుమ్మల నాగేశ్వరరావు, వారి సతీమణిపై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్ నాయకులారా ఖబర్దార్ అని కాంగ్రెసు నాయకులు హెచ్చరించారు. శుక్రవారం దమ్మపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కక్కిరాల రమేష్ అధ్యక్షతన జరిగిన ప్రెస్ మీట్‌లో నాయకులు మాట్లాడుతూ వ్యక్తిగత విషయాలపై విచక్షణ రహిత బుద్ధిమంద లోపంతో అవాకులు చవాకులు పేలుతున్న ఉప్పాల వెంకటరమణ, బిఆర్ఎస్ నాయకులకు త్వరలోనే బుద్ధి చెబుతామని ఆ అంశాన్ని తీవ్రంగా ఖండించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, టౌన్ అధ్యక్షులు చిన్న శెట్టి చిట్టిబాబు, కాంగ్రెస్ పార్టీ దమ్మపేట మండల ఉపాధ్యక్షులు కాసాని ప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, చిన్న శెట్టి యుగంధర్, అత్తులూరి వెంకటరమణ, కెవి, దమ్మపేట మండల మైనార్టీ అధ్యక్షులు ఎస్కే రఫీ, రొయ్యల కుమార్, దమ్మపేట మండల టిపిసిసి సోషల్ మీడియా కోఆర్డినేటర్ రషీద్, అన్నవరపు నాగేంద్ర, వనమాల శీను తదితరులు పాల్గొన్నారు.

## టిజి ఆయిల్‌ఫెడ్ ఆస్తులు కాపాడుకుందాం:పుల్లయ్య

అశ్వారావుపేట అర్బన్, సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త):



ఆయిల్ ఫెడ్ ఆస్తులు సంరక్షణ కోసం శనివారం ఆయిల్ ఫెడ్ డివిజనల్ కార్యాలయం ముందు తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ తెలంగాణ ఆయిల్ ఫాం రైతు సమాఖ్య బాధ్యులు తుంబూరు మహేశ్వర రెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య లు పామాయిల్ రైతులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోట్లాది రూపాయల విలువైన హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్లోని టీజీ ఆయిల్ ఫెడ్ స్థలాన్ని ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీకి విక్రయించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయిల్ ఫెడ్ ను నిర్వీర్యం చేసే ప్రభుత్వ అనాలోచిత కార్యాచరణ ను తిప్పికొట్టేందుకు రైతులు అందరూ ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైంది అని తెలిపారు. ఆయిల్ ఫెడ్ ఆస్తులు సంరక్షణ ధ్యేయం గా చేపట్టిన ఈ నిరసనకు రైతులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**ఏన్కూరు, సెప్టెంబర్ 04, ప్రభాత వార్త:**

మండల కేంద్రమైన ఏన్కూరులోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా ని ర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు.. రాధా.. గోపికల వేషధారణలో సంప్రదాయ దుస్తులు.. ఆభర ణాలతో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారుల కృష్ణుడి వేషధారణ.. అల్లరి చేష్టలు.. చిలిపి విన్యాసాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రాధాకృష్ణుల జీవిత చరిత్రను ఉపాధ్యాయులు విద్యార్థులు వివరించి అవగాహన కల్పించారు. వెన్న కుండలతో బాల బాలికలకు ఉట్టి కొట్టే ఆటపాటలు... ముచ్చట గొలిపింది. పిల్లల గ్రోవితో చిన్నారు లు ఆట పాటలు అందరిని అలరించాయి. చిన్నారుల వేషధారణతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. పాఠ శాల ప్రాంగణంలో గోపిక.. రాధా.. శ్రీకృష్ణుడు వేషధారణలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించగా.. చిన్నారులు ఉ త్సాహంగా పాల్గొని వేడుకలను సందడిగా మార్చారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శించిన సంస్కృతి కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పోతినేని భూమేశ్వరరావు మాట్లాడుతూ..





కృష్ణాష్టమి వంటి పండు గల ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి.. సంప్రదాయాలపై అవగాహన కల్పించడంతో పాటు.. వారి లోసృజనాత్మక తను పెంపొందించవచ్చని ఆయన అన్నారు. విద్యార్థులు పండుగ విశిష్టతను తెలుసుకుని ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. చిన్నారులు పండుగ గల ప్రాముఖ్యతను తెలుసుకునేలా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. శ్రీకృష్ణుడు బాల్య ఘటనలను గుర్తు చేసుకుంటూ విద్యార్థులు వేషధారణలు... సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు. విద్యా ర్థులలో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు పాఠశాలలో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కృష్ణాష్టమి వేడుకలతో చిన్నారులలో మన సంస్కృతి పట్ల ఆసక్తి.. భక్తి భావం పెంపొందితుందని ఆయన తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా ఈ వేడుకలలో పాల్గొనడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు. అదే విధంగా.. పాఠశాల కరస్పాండెంట్.. వెంకట సాయి మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పా టు భారతీయ సంస్కృతి.. సంప్రదాయాలు.. పండుగల విశిష్టతను తెలియజేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు.. తల్లిదండ్రులపై ఉందని ఆయన అన్నారు. కృష్ణాష్టమి వంటి వేడుకలు.. చిన్నారుల్లో సాంస్కృతిక విలువలను పెం పొందించడంతోపాటు వారిలో సృజనాత్మకతను వెలికితీస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాధనాన్ని వృధా చేస్తున్న మున్సిపల్ అధికారులు

## అడ్డుగా వదిలేసిన పైప్ లైన్ నెలలు గడుస్తున్న గాని పట్టించుకోని అధికారులు

**వైరా టౌన్ సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త)**

వైరా మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ఎద్దడి నివారణ మరియు మౌలిక వసతుల మెరుగుదల కోసం అమృత్ పథకం కింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం కలిసి 26.87 నిధులు మంజూరు చేశారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా వివిధ అవార్డులలో తాగునీటి అద్దాలు లేకుండా సరఫరాను మెరుగుపరచడానికి మూడు నూతన వాటర్ ట్యాంకులు వాటర్ హెడ్ రిజర్వాయర్ల నిర్మాణం మరియు పట్టణ పరిధిలోని కొత్తగ



దాదాపు 18 కిలోమీటర్ల మేర త్రాగునీటి పైప్ లైన్ వాటర్ లైన్ విస్తరణ. ఈ నిధుల ద్వారా మున్సిపాలిటీలోని 20 వార్డులలో ఉన్న ఇళ్లకు నిరంతరంగా మరియు సురక్షితమైన తాగునీటిని అందించడానికి వాటర్ గ్రేడ్ కనెక్టివిటీని బలోపేతం చేయనున్నారు. సదరు అధికారులు మాత్రం ఈ వ్యవహారంలో నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తున్నారు అనడంలో ఎటువంటి సందేహం కూడా లేదు. ఎక్కడి పైపులైన్లు అక్కడే ఉంచి కొందరి వ్యాపారానికి అడ్డుగా కొన్ని గృహ సముదాయాలకు అడ్డుగా ఉన్నాయని వాపోతున్నారు. అన్నీ కూడాను సగం సగం పనులు చేసి చేతులు దులుపుకుంటూ చూసి ఉన్నట్లు వ్యవహరిస్తున్న తీరును సదరు అధికారులకు అలవాటుగా మారింది. కొన్ని నెలల క్రితం తీసిన పైప్ లైన్ మెయిన్ రోడ్ వెంబడి పైప్లైన్ వదిలేసిన తీరును చూసి వైరా మున్సిపల్ అధికారులు పనితీరును చూసి ప్రజలు నవ్వుకునేలా ఉన్నాయని అనుకుంటున్నారు. ఇలా వదిలేసిన పైపులైను సంబంధిత అధికారులు విచారణ జరిపి అడ్డుగా ఉన్న పైపులైను గాడి తీసి నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.




## దళిత రత్న అవార్డు గ్రహీత వీరన్నకు సన్మానం

**కారేపల్లి సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:**

బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దళిత రత్న అవార్డు గ్రహీత మెట్టు వీరన్న ను ఘన సన్మానం నిర్వహించారు. మండల కేంద్రమైన కారేపల్లి లో శుక్రవారం బిఎస్ఎఫ్ఐ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బిఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా అధ్యక్షులు దాసరి రాజశేఖర్ మాట్లాడుతూ, సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న వ్యక్తులను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, విద్య మరియు హక్కుల కోసం కృషి చేస్తున్న మెట్టు వీరన్న గారికి దళిత రత్న అవార్డు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. యువత, విద్యార్థులు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని దాసరి రాజశేఖర్ పిలుపునిచ్చారు. సామాజిక సేవా రంగంలో ముందుండే వారిని ప్రోత్సహించడం ద్వారా మరింత మంది యువత సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ఐ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గద్దల నాగరాజు బిఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా సెక్రెటరీ చిలుముల అజయ్, నాయకులు వివేక్, సందీప్, నాగుల్, మీరా తదితరులు పాల్గొన్నారు.

## వైరా లో చికెన్ సెంటర్ ప్రారంభం

**వైరా టౌన్ సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త)**

వైరా మున్సిపాలిటీ పరిధిలోని పాత బస్టాండ్ సమీపంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన జాలాది చికెన్ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈకార్యక్రమానికి రాజకీయాలకతీతంగా పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు హాజరై జాలాది రామకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ప్రారంభించిన వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని, జాలాది రామకృష్ణ వ్యాపారంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో బొర్రా రాజశేఖర్, కట్టా కృష్ణార్జునరావు, కట్ల రంగారావు, సూతకాని జైపాల్, ముల్లపాటి సీతారాములు, కాపా మురళీకృష్ణ, మిట్టపల్లి నాగి, నాగబత్తిని భాస్కర్, మోహన్‌రెడ్డి, రేచర్ల సత్యనారాయణ, ఉండరు శ్యాంబాబు, మద్దేల రవి, పమ్మి అశోక్, అప్పం సురేష్, ధర్నా శేఖర్, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, వీరంశెట్టి సీతారాములు, రేచర్ల వెంకటేష్ పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో జాడ లేని హామీలు

**మోసపూరిత వాగ్దానాలు నెరవేరేది ఎన్నడు?**

**కెసిఆర్ రాక కోసం ప్రజలు నిరీక్షణ**

**రాబోయేది బి ఆర్ఎస్ ప్రభుత్వమే**

**బైకు ర్యాలీ వంటావార్పు**

**కారేపల్లి సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**

ఎన్నికల సమయంలో మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి తమ స్వార్థాల కోసం నేతలు పాటుపడుతున్నా ప్రజా పాలన ప్రభుత్వానికి గుడ్ బై చెప్పే రోజులు దగ్గరికి వచ్చాయని రాబోయే బి ఆర్ఎస్ ప్రభుత్వమేనని జిల్లా బీఆర్ఎస్ నేత శాసనమండలి సభ్యులు తాత మధు మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి నేతలు అన్నారు. సింగరేణి మండలం కారేపల్లి క్రాస్ రోడ్ నందు కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు చేసిన మోసానికి నిరసనగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ఆదేశాలతో శుక్రవారం వంటావార్పు కార్యక్రమాన్ని మండల బిఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా



ఏర్పాటుచేసిన సమరభేరి సమావేశంలో ఎమ్మెల్సీ తాత మధు నాయకులు మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశారని, అడగకుండానే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్కే దక్కుతుందని పేర్కొన్నారు. తెలంగాణ అనేది మేధావుల ఆలోచనతో ఏర్పడిన రాష్ట్రం కాగా, తెలంగాణ అస్తిత్వం కోసం ఉద్యమించి, రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. రైతు బిడ్డగా రైతుల కష్టాలు, సమస్యలు కేసీఆర్కు తెలుసని, అందుకే ఆయన పాలనలో రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. అధికారం కోసమే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారంటీల పేరుతో



ప్రజలకు ఇచ్చిన హామీలు నేడు తెలంగాణ ప్రజలకు శాపంగా మారాయని విమర్శించారు. మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు.

రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కంటే భూములు అమ్ముకోవడంపైనే కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన వంట వార్పు కార్యక్రమంలో బీఆర్ఎస్



నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల హక్కులు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని నాయకులు తెలిపారు. ఈ. కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు బానోత్ మనీషా లక్ష్మీ మదన్ లాల్, లాకవత్ గిరిబాబు, ,పొట్ల శ్రీనివాస్ రావు, కట్ల కృష్ణ, బాణాల శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ లు ముత్యాల సత్యనారాయణ, ఉసేం వీరేందర్, వాంకుడోత్ జగన్, మైనారిటీ నాయకులు ఎస్కే గౌస్ ఉద్దీన్ అప్పారావు, డొంకెన రవీందర్, మాజీ సర్పంచ్ కుమార్, మాజీ ఎంపీటీసీలు శంకర్ అజ్మీర రవి, అచ్చయ ,మండల ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ బస్సీలాల్, తాత వెంకన్న ,నాగరాజు, ,వికాస్, రాజేష్, మాజీ సర్పంచులు జర్పుల హచ్చు, సక్రూ, మోహన్, జాల సాంబ సింగరేణి మండల బి ఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు కోటీశ్వరులవ్వాలి

**మహిళా సంఘాలకు అండగా ప్రభుత్వం**

**వడ్డీలేని రుణాలు, ఉపాధి అవకాశాలు...**

**మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేసిన మంత్రి సీతక్క**





సత్తుపల్లి సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా స్వతంత్రంగా జీవిస్తూ, ఆర్థికంగాఎదిగికోటీశ్వరులుగా మారాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మహిళల చేతుల్లో డబ్బు ఉండాలని, తమకు నచ్చిన విధంగా జీవించే ఆర్థిక స్వేచ్ఛను కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. సత్తుపల్లి పట్టణంలోని సిద్దారం రోడ్డులో గల ఎం.ఆర్. గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో 1000 రోజుల ప్రజా పాలనలో భాగంగా శుక్రవారం నిర్వహించిన ఇందిర మహిళాశక్తి చీరల పంపిణీ సదస్సులో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళలు పెద్ద ఎత్తున ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరవుతున్నారంటే ప్రభుత్వంపై వారికి ఉన్న ప్రేమ, విశ్వాసానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను కుటుంబ సభ్యులుగా భావిస్తూ, వారి ఆర్థిక స్వావలంబనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని మంత్రి తెలిపారు. మహిళలు తమకు నచ్చిన వ్యాపారాలను ప్రారంభించి, స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు. ఇందుకోసం మహిళా సంఘాలకు ఏపీఎంలు, డీఆర్‌డీఓ అధికారులు అవసరమైన సహకారం అందిస్తారని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి గత రెండున్నరేళ్లలో పంచాయతీరాజ్, మహిళా సంఘం సంక్షేమం, తాగునీరు తదితర రంగాల్లో సుమారు రూ.300 కోట్ల వరకు నిధులు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి పల్లె, గూడెం, తండా, వాడలో అవసరమైన సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళా సంఘాలు కేవలం పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలోకి రావాలనిమంత్రిపిలుపునిచ్చారు. మహిళా ఆర్థిక పురోగతికి కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి మేడారం జాతర సందర్భంగా మహిళా సంఘాలకు సుమారు రూ. 6 కోట్ల మేర రుణ సహాయం అందించగా, మహిళలు కేవలం 15 రోజుల్లోనే సుమారు రూ.9 కోట్ల వ్యాపారం చేసి లాభాలు ఆర్జించారని గుర్తుచేశారు. సత్తుపల్లిలో కూడా టిఫిన్ సెంటర్లు, క్యాంటీన్లు, డెయిరీ, పౌల్ట్రీ, సోలార్, కుట్టు యూనిట్లు, స్థానికంగా లభించే అటవీ ఉత్పత్తుల ఆధారంగా వివిధ వ్యాపారాలు ప్రారంభించాలని మంత్రి సూచించారు. స్థానికంగా లభించే ఉత్పత్తులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి విక్రయిస్తే మహిళలకు మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, కలెక్టరేట్లు, ఇతర ప్రజలు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో మహిళా సంఘాలతో ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో మహిళలు క్యాంటీన్ల ద్వారా నెలకు రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు ఆదాయం పొందుతున్నారని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, రుణాలపై వడ్డీ భారాన్ని ప్రభుత్వం భరిస్తోందన్నారు. మహిళా సంఘాల సభ్యులకు రుణ బీమా సదుపాయం కల్పిస్తూ, రుణం తీసుకున్న సభ్యురాలు మరణించిన సందర్భంలో నిర్దిష్ట పరిమితి వరకు రుణాన్ని మాఫీ చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రమాదవశాత్తు మహిళలుమరణించినప్పుడు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసాకల్పించేందుకు రూ.10 లక్షల వరకు సహాయం అందిస్తున్నామని చెప్పారు. మహిళలకు ఆత్మగౌరవ భవనాలుమహిళా సంఘాల సమావేశాలు చెట్ల కింద లేదా ఇతరుల ఇళ్ల వద్ద నిర్వహించాల్సిన పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వీవో భవనాలనునిర్మిస్తోందన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే 110 వీవో భవనాలు మంజూరు చేశామని, ఇంకా అవసరమైన భవనాలను కూడా మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా సమాఖ్యల కోసం రూ. 5నుంచి రూ.7 కోట్ల వ్యయంతో భవనాలను నిర్మిస్తున్నామని, మహిళల శిక్షణ, సమావేశాలు, వ్యాపార కార్యకలాపాలకు అవి ఉపయోగపడతాయని చెప్పారు. మహిళల విద్యకు ప్రభుత్వం ప్రాధాన్య మహిళలకు అక్షరాస్యత కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళా సంఘాల్లోని నిరక్షరాస్యుల అందరికీ చదువునేర్పించాలన్న లక్ష్యంతో కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మహిళల పేర్లపైమహిళలకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించడంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేర్లపై మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇల్లు, రేషన్ కార్డు వంటి ప్రభుత్వ ప్రయోజనాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని, మినీ అంగన్వాడీలను ప్రధాన అంగన్వాడీలుగా మార్చి సిబ్బందికి వేతనాలు పెంచామని, రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంగన్వాడీ పిల్లలకు యూనిఫాంలతో పాటు అల్పాహారం, పోషకాహారం అందించే కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లోనే చిన్నారులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని, పిల్లలను తప్పనిసరిగా ప్రైవేట్ పాఠశాలలకు పంపాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ అంగన్వాడీలను మరింత బలోపేతం చేస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూమహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందిస్తున్న పథకాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. చిన్న స్థాయిలో కుట్టు మిషన్‌తో ప్రారంభించిన మహిళలు నేడు పెద్ద కంపెనీలు నిర్వహించే స్థాయికి ఎదుగుతున్నారని అన్నారు. ఇందిర మహిళాశక్తి కార్యక్రమం కింద మహిళలకు వివిధ రంగాల్లో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు రుణాలు, బీమా తదితర సౌకర్యాలు కల్పించడం ద్వారా ఆర్థిక భద్రతను కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ గతంలో మహిళా సంఘాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, రుణాలపై అధిక వడ్డీ భారంతో చాలామంది సభ్యులు సంఘాల నుంచి వైదొలిగిన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. కిశోర్ బాలికలు, వృద్ధులు, దివ్యాంగులు తదితర వర్గాల కోసం ప్రత్యేక గ్రూపులను ఏర్పాటు చేసి మహిళా సంఘాల కార్యకలాపాలను మరింత విస్తరిస్తున్నామని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గంలో కొత్తగా సుమారు 470 మహిళా సంఘాలు ఏర్పడటం మహిళల్లో పెరుగుతున్న చైతన్యానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టదయానంద్, ఏఎంసి చైర్మన్లు దోమ ఆనంద్ బాబు, భాగం నీరజా చౌదరి, మున్సిపల్ చైర్ పర్సన్ మహమ్మద్ రెహానా కమల పాష, కల్లూరు మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్, ఎసీపీ వసుంధర యాదవ్ ఐపీఎస్,సీఐ తుమ్మలపల్లి శ్రీహరి, సత్తుపల్లి మున్సిపల్ కమీషనర్ కె నరసింహం, కౌన్సిలర్లు గ్రాండ్ మోలాలి, దూదిపాల రాంబాబు, బండారు శరత్, తోట సుజలా రాణి ,ఇరివాడ అవర్ణనాగభూషణం,కాంగ్రెస్ నాయకులు గాది చెన్నారావు, మహ్మద్ కమల్ పాషా, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రజలకు వైద్య భరోసా!

**పాల్వంచలో క్యాన్సర్ ట్రీట్‌మెంట్‌కు తొలి అడుగు**

**ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగులు అవసరం లేదు!**

**కలెక్టర్ చొరవతో 10 కుంటల భూమి కేటాయింపు**

**మంత్రి పొంగులేటి ప్రత్యేక చొరవ**

**రూ.1.50 కోట్లతో వైద్య భవనం**

**డయాలసిస్.. బ్లడ్ బ్యాంక్.. క్యాన్సర్ నిర్ధారణ!**

**స్థలం నుంచి నిధుల దిశగా.. ప్రజలకు చేరువలో వైద్యం**

భద్రాచలం ప్రభాతవార్త:

ఏజెన్సీ ప్రాంత గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కీలక ముందడుగు పడింది. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సులభంగా చేరుకునే కేంద్ర బిందువుగా ఉన్న పాల్వంచలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కేంద్రంతో పాటు మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, డయాలసిస్ సెంటర్, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. ఇందుకు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు.

**ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని...**

ఏజెన్సీ గ్రామాల్లో క్యాన్సర్, కిడ్నీ తదితర తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న ప్రజలు మెరుగైన వైద్యం కోసం ఖమ్మం, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసర సమయాల్లో రవాణా ఇబ్బందులతో అనేక కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. ఈ పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపేలా పాల్వంచలో వైద్య సదుపాయాల ఏర్పాటుకు చర్యలు చేపట్టడం గిరిజన ప్రజలకు ఎంతో ఊరటనిచ్చే అంశంగా మారింది.



**రెడ్‌క్రాస్ వినతికి మంత్రి సానుకూల స్పందన**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధులు శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. పాల్వంచలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌తో పాటు క్యాన్సర్ నిర్ధారణ కేంద్రం, డయాలసిస్ సెంటర్, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్‌ను తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**కలెక్టర్ చొరవకు ప్రత్యేక గుర్తింపు**

ఏజెన్సీ ప్రాంతంలో వైద్య సేవలను విస్తరించాలన్న లక్ష్యంతో జిల్లా కలెక్టర్ అంకిత్ ఇప్పటికే పాల్వంచ మండలంలో 10 కుంటల భూమిని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి కేటాయించడం ప్రాజెక్టుకు కీలక మలుపుగా మారింది. జిల్లా నడిబొడ్డున ఉన్న ఈ స్థలం అన్ని ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండేలా ఎంపిక కావడం విశేషం.

**రూ.1.50 కోట్లతో నిర్మాణం**

కేటాయించిన స్థలంలో సుమారు 2,200 చదరపు అడుగుల భవనం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం కాగా, నిర్మాణానికి సుమారు రూ.1.50 కోట్లు వ్యయం అవుతుందని రెడ్‌క్రాస్ ప్రతినిధులు మంత్రికి వివరించారు. స్థలంతో పాటు నిర్మాణానికి అవసరమైన నిధులు, ఇతర సహకారంపై ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లభించడంతో ప్రాజెక్టుపై ఆశలు పెరిగాయి.

**'మీ పాలిట నేనున్నా' అన్న భరోసా**

ఏజెన్సీ గిరిజన గ్రామాలతో విస్తరించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రజలకు అందుబాటులో ఉండే వైద్య కేంద్రం ఏర్పాటు కావడం పేద, గిరిజన కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. స్థల కేటాయింపులో కలెక్టర్ అంకిత్ చొరవ, వైద్య సదుపాయాల ఏర్పాటుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీసుకుంటున్న ప్రత్యేక చొరవ పై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**గవర్నర్ సూచనలకు అనుగుణంగా...**

గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలన్న రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల సూచనల మేరకు, సెక్రటరీ టు గవర్నర్ దాన కిషోర్, ఐఆర్‌సీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎ. శ్రీరాములు సూచనలతో పాల్వంచలో భూమి కేటాయింపు జరిగినట్లు రెడ్‌క్రాస్ ప్రతినిధులు తెలిపారు.

**ప్రజల ఆశలకు కార్యరూపం**

ఇప్పటివరకు తీవ్రమైన అనారోగ్యంతో దూర ప్రాంతాలకు పరుగులు తీసిన ఏజెన్సీ ప్రజలకు ఇక స్థానికంగానే కీలక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించడంతో పాటు కిడ్నీ బాధితులకు డయాలసిస్, అత్యవసర రక్త అవసరాలకు బ్లడ్ బ్యాంక్ అందుబాటులోకి వస్తే వేలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. స్థలం కేటాయింపుతో ఆగకుండా నిర్మాణ పనులు, నిధుల సమీకరణ, వైద్య పరికరాల ఏర్పాటుపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ డా. ఎస్.ఎల్. కాంతారావు, పి. వెంకటేశ్వరరెడ్డి, వై. సూర్యనారాయణ, జి. రాజారెడ్డి, వి.కామేశ్వరరావు, హరిశ్చంద్ర నాయక్, సోమరౌతు శ్రీనివాసరావు, డా. భాను ప్రసాద్, బి. సిద్ధారెడ్డి, ఆదినారాయణ తదితరులు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

# బీఆర్‌ఎస్ నేతలకు కాంగ్రెస్ ఘాటుగా సవాల్



**వైరా సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త)**

వైరా మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్ బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చేసిన విమర్శలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నిన్న కొనిజర్లలో కూర్చొని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇష్టారాజ్యంగా మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, ఇప్పుడు అధికారం పోయిన తర్వాత మైకుల ముందు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉంది. మీరు విసిరిన సవాలును కాంగ్రెస్ పార్టీ స్వీకరిస్తోంది. దమ్ముంటే వైరా నియోజకవర్గ రింగ్ సెంటర్‌కు రండి. మేము మా ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి వస్తాం. తడి బట్టలతో ప్రమాణం చేయడానికైనా సిద్ధం. మీరు అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెబుతాం. ప్రతి లెక్కను ప్రజల ముందే పెడతాం అని పమ్మి అశోక్ సవాల్ విసిరారు. రుణమాఫీపై మాట్లాడే ముందు బీఆర్‌ఎస్ తమ గతాన్ని గుర్తు చేసుకోవాలి. రైతు రుణమాఫీ గురించి మాట్లాడే ముందు బీఆర్‌ఎస్ నాయకులు తమ పదేళ్ల పాలనలో ఏం చేశారో గుర్తు చేసుకోవాలి. రూ.1 లక్ష రుణమాఫీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేక రైతులను బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ తిప్పిన చరిత్ర మీదే. రైతుల కన్నీళ్లకు కారణమైన మీరు ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉంది అని ఆయన తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల లోపు రైతు రుణమాఫీ అమలు చేసింది. దీనిపై మీకు అనుమానం ఉంటే రండి. రైతుల దగ్గరకు తీసుకెళ్లి చూపిస్తాం. కాగితాల మీద కాకుండా క్షేత్రస్థాయిలో వాస్తవాలను చూపిస్తాం అని అన్నారు.గోదావరి జలాలపై తప్పుడు ప్రచారం మానుకోవాలివైరా నియోజకవర్గానికి గోదావరి జలాలు రాలేదంటూ బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను పమ్మి అశోక్ తీవ్రంగా ఖండించారు. గోదావరి జలాలు రాలేదని చెప్పడం మీ రాజకీయ అజ్ఞానానికి నిదర్శనం. వైరా నియోజకవర్గానికి తలమానికమైన రిజర్వాయర్ వద్దకు రండి. గోదావరి జలాలు ఎలా వచ్చాయో, ఎక్కడికి చేరాయో ప్రత్యక్షంగా చూపిస్తాం. ప్రజలను తప్పుదోవ పట్టించే అబద్ధాల ప్రచారం ఇకనైనా ఆపండి అని హెచ్చరించారు. అప్పుల కుప్పను మిగిల్చి ఇప్పుడు కాంగ్రెస్‌పై విమర్శలా. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రాన్ని భారీ అప్పుల ఊబిలోకి నెట్టారు. లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టారు. ఆ అప్పులకు వడ్డీలు కడుతూ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగిస్తోంది. అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోంది. మీరు చేసిన అప్పులకు మేము వడ్డీలు కడుతూ, మీరు చేయలేని సంక్షేమాన్ని మేము చేస్తుంటే. మాపై విమర్శలు చేయడానికి మీకు సిగ్గు ఉండాలి అని పమ్మి అశోక్ ఘాటుగా వ్యాఖ్యానించారు. 3650 రోజులు అధికారంలో ఉండి ఏం చేశారు?దాదాపు 3650 రోజులు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చిందో రాష్ట్ర ప్రజలకు తెలుసు. పదేళ్ల పాలనలో చేయలేనివి కాంగ్రెస్ 1000 రోజుల్లో చేయగలిగితే.. మీ పదేళ్ల పాలనకు, మా 1000 రోజుల పాలనకు తేడా ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోంది" అని అన్నారు. అధికారం ఉన్నప్పుడు ప్రజల సమస్యలు కనిపించలేదు. ఇప్పుడు అధికారం పోయిన తర్వాత ప్రతి విషయంపై మొసలి కన్నీళ్లు కారుస్తున్నారు. ప్రజలు మీ మాటలను నమ్మే రోజులు ఎప్పుడో పోయాయి. ఎన్నికల్లో ఎందుకు మిమ్మల్ని తిరస్కరించారో ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోండి అని బీఆర్‌ఎస్ నాయకులకు సూచించారు. బురద చల్లాలని చూస్తే నిజాలు బయటపెడతాం కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంత బురద చల్లాలని చూసినా అది మీ చేతులకే అంటుకుంటుంది. ఎందుకంటే ప్రజలు వాస్తవాలను చూస్తున్నారు. సోషల్ మీడియాలోనో, సభల్లోనో ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజల కళ్లను మోసం చేయలేరు అని పమ్మి అశోక్ అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఇకనైనా చవకబారు రాజకీయాలు, అబద్ధాల ప్రచారం మానుకోవాలి. ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ఇక సాగవు. వైరా ప్రజలు ఎవరు పనిచేస్తున్నారో, ఎవరు మాటలు మాత్రమే చెబుతున్నారో ఇప్పటికే గుర్తించారు. ప్రజల తీర్పును గౌరవించి వాస్తవాలు మాట్లాడటం నేర్చుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులకు సూచిస్తున్నాం అని పమ్మి అశోక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకుల డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళి కృష్ణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పణితి శ్రీనివాస్ రావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి కొట్టే రాజశేఖర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వంకుడోతూ భిక్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బీడీకే రత్నం, అష్టగుర్తి గ్రామ శాఖ అధ్యక్షులు పటేల్, తెళ్ళూరి వీరయ్య, తోటకూర శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## జింకల బంజర మర్రిగూడెం బీటీ రోడ్డులో ప్రమాద భరితంగా గుంత





**కామేపల్లి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:**

కామేపల్లి మండలం కెప్టెన్ బంజర పంచాయతీ పరిధిలోని జింకల బంజర నుండి మర్రిగూడెం కు వెళ్లే ప్రధాన రహదారిలో కల్వర్టు వద్ద బీటి రోడ్డు కుంగి దెబ్బతింది.కొంతమేర కల్వర్టు కూడా దీంతో దెబ్బతినడం జరిగింది.ఈ రహదారిలో నిత్యం రాకపోకలు ఎక్కువగా జరుగుతుంటాయి.అయితే కల్వర్టు వద్ద రోడ్డు కుంగి దెబ్బతినడం, కల్వర్టు కూడా దెబ్బతినడంతో ప్రమాదభరితంగా ఉంది.ఇటీవల ఈ ప్రదేశంలో పలువురు వాహనదారులు కిందపడి గాయాలు పాలైన సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి.రైతులు,మూగజీవాలు,ప్రజలు కూడా నానా అవస్థలు పడు తున్నారు.సంబంధిత అధికారులు ఈ విషయం పై దృష్టి సారించకపోవడం,అడ్రస్ లేకుండా పోవడంతో వాహనదారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.సత్వరమే సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి కుంగి దెబ్బతిన్న రోడ్డుకు, కల్వర్టు కూడా తక్షణమే మరమ్మతులు నిర్వహించి రోడ్డు ప్రమాదాలు అరికట్టాలని త ద్వారా నిండు ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు.లేని ఎడల ఆందోళన చేస్తామని శుక్రవారం వాహనదారులు, రైతులు,ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు హెచ్చరించారు.

## సత్తుపల్లిలో సీతక్కను కలిసిన మున్సిపల్ వైస్ చైర్మన్ సంతోష్



**వైరా టౌన్ సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త)**

జిల్లా పర్యటనలో భాగంగా సత్తుపల్లి వచ్చిన రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను శుక్రవారం వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ మర్యాదపూర్వకంగా కలిసి మున్సిపాలిటీ పరిధిలో సమస్యలను విన్నవించారు. ప్రధానంగా వైరా మున్సిపాలిటీ పరిధిలో అంగన్వాడి కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నామని వాటి స్థానంలో నూతన భవనాలు మంజూరు చేయాలని కట్ల సంతోష్ విన్నవించారు. మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించి మున్సిపాలిటీ పరిధిలో అంగన్వాడీ భవనాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శీతక్కను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెరుకూరి కిరణ్, అనుమోలు నరసింహారావు, కొమ్మినేని అశోక్, పువ్వాళ్ళ రాజా, రాచకొండ సాయి తదితరులు పాల్గొన్నారు.

## ధర్మానికి దిక్సూచి శ్రీకృష్ణ పరమాత్ముడు

**కామేపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త :**

శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా దేశమంతటా పల్లెల్లో, గ్రామాలలో, నగరాలలో పట్టణాలలో జరుపుకునే వేడుకలలో భాగంగా బాలకృష్ణుడు గా ఉన్నప్పుడు గోపికలు ఉట్టిపై దాచిన వెన్నను దొంగిలించడానికి చేసిన ప్రయత్నాలను కులాల వర్గాలకతీతంగా ముఖ్యంగా యాదవులు ఉట్లు కొట్టే కార్యక్రమం పండుగగా ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహిస్తారు.ఈ సందర్భంగా ఖమ్మం నగరం 17వ,డివిజన్ టీచర్స్ కాలనీ,ప్రకాష్ నగర్, చింతకాని మండలం కొదుమూరు, వైరా మండల అష్ణ గుర్తి గ్రామాల్లో శుక్రవారం జరిగిన కృష్ణాష్టమి ఉత్సవాలలో డిసిసిబి డైరెక్టర్, అఖిలభారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్, నాగనబోయిన రాజారాం లు సంబరాలు జరిపారు. మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ మూగజీవాలను కంటికి రెప్పలా కాపాడుతూ, గోవులను సంరక్షిస్తూ అమాయకంగా జీవించే యాదవుల వంశంలో సాక్షాత్తు శ్రీమహావిష్ణువు దశావతారం లో భాగంగా గోవులను ఇష్టపడే గోవిందునిగా, దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించే శ్రీకృష్ణ పరమాత్మునిగా పరిపూర్ణమైన భగవంతుడిగా అవతరించిన యాదవ కులం ఎంతో పవిత్రమైనదని పురాణాలు చరిత్రలు చెబుతున్నాయి. ఇప్పటివరకు తిరుపతి వెంకటేశ్వర స్వామి నికూడా ప్రతిరోజు మొట్టమొదటి దర్శనం యాదవులకు మాత్రమే ఉండడం మన అదృష్టంగా భావిస్తున్నాను. శ్రీకృష్ణుడు ధర్మానికి దిక్సూచిగా నిలబ డిందని, అలాంటి మహాగ్రంథమును ప్రతి ఒక్కరి ఇంటిలో ఉంచుకో వాలని, గతంలో కాటమరాజు ప్రతాపరుద్రుడు, శ్రీకృష్ణదేవరాయలు లాంటి యాదవు లంతా రాజ్యాలను పాలించారని, వారి కాలంలో ప్రజలు సుఖ శాంతులతో జీవించారని చరిత్రలు చెబుతున్నాయి. అందుకేయాదవు లంతా ఐక్యంగా ఉంటే గతంలో కోల్పోయిన వైభవాన్ని ఉత్తర భారత దేశంలో లాగా మనం కూడా ఇక్కడ సాధించ వచ్చని పిలుపునిచ్చారు.ఈ ఉత్సవ కార్యక్ర మంలో నాగన్న బోయిన నాగరాజు, కొమ్ము శ్రీశైలం, కొమ్మ మల్లయ్యా, మట్టపల్లి వెంకన్న, కొమ్ము శ్రీను, అవిరేని శ్రీను, సైదులు పాల్గొన్నారు.

## కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ప్రశంసా పత్రాలు.



**ఏన్కూరు,సెప్టెంబర్ 04, ప్రభాత వార్త :**

విశ్వ సహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏన్కూరులో రెండు నెలల పాటు నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణ కార్యక్ర మాన్ని విజయవంతంగా పూర్తి చేసిన మహిళలకు ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అ ఖిల భార త మత మందిర్ అధ్యక్షులు రామరాజు ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ పొందిన మహిళలకు ప్రశంసా పత్రాలను అంద జేశారు.ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ.. విశ్వ సహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏన్కూరులో సు మారు 21 మంది మహిళలకు రెండు నెలల పాటు కుట్టు మిషన్ శిక్షణ అందించినట్లు ఆయన తెలిపారు.శిక్షణ ద్వా రా మహిళలు కుట్టుపని నేర్చుకుని స్వయంగా ఉపాధి పొందడంతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న నేపథ్యంలో..ఈ శిక్షణ వా రికి ఎంతగానో ఉపయోగపడుతుందని రామరాజు అన్నారు.మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో కోమల్ల రాజేందర్ రెడ్డి,బ్రహ్మ నందం,ప్రముక్,స్వాతి,ఆవుల నరసయ్య,శిక్షణ పొందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి గానుగు మొక్కల పంపిణీ

**కారేపల్లి సెప్టెంబర్ 4 ప్రభాతవార్త**



గ్రామపంచాయతీలో ప్రతి ఒక్కరూ హరితహారం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పర్యావరణ పరిరక్షణకు సహకరించాల్సిందిగా గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ అన్నారు. సింగరేణి మండలం గాదెపాడు గాదేపాడు గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి ఇంటికి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఒక పూల మొక్క ఒక గానుగ మొక్కను శుక్రవారం అందజే శారు. ప్రజలు ప్రతి ఇంటికొక రెండు మొక్కల్ని నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యతను వారే చేపట్టాలన్నారు. గ్రామం పచ్చదనం ఉండే విధంగా మన గ్రామపంచాయతీ ని అభివృద్ధి పదంలో ముందు ఉంచవలసిందిగా ప్రజలను కోరారు .ఈ.కార్యక్రమంలో గాదేపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ ఫీల్డ్ అసిస్టెంట్ కె కెవ్వులియా గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాధు సంత్‌లకు రూ.25 వేల గౌరవ వేతనం ఇవ్వాలి

**గ్రామాల్లో ఆలయాల నిర్మాణం చేపట్టాలి:**

**సాధు సంత్‌ల జేఏసీ**

లక్ష్మీ మ్రదేవిపల్లి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: హిందూ ధర్మ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న సాధు సంత్‌లకు ప్రభుత్వం నెలకు రూ.25 వేల గౌరవ వేతనం అందించాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా సాధు సంత్‌ల జేఏసీ నూతన చైర్మన్ తేజావత్ రాములు నాయక్ డిమాండ్ చేశారు. దీప, ధూప, నైవేద్యాల నిర్వహణకు కూడా ప్రభుత్వం సహకరించాలని కోరారు. లక్ష్మీ మ్రదేవిపల్లి మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన సమావేశంలో సాధు సంత్‌ల జేఏసీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా తేజావత్ రాములు నాయక్, గౌరవాధ్యక్షులుగా బానోత్ చందు, గుగులోత్ బిచ్చా, వైస్ చైర్మన్లుగా మాలోత్ రమేష్, జాటోత్ శంకర్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా భూక్య బాలు, ట్రెజరర్‌గా ధరమ్‌సోత్ లచ్చును నియమించారు. ఈ సందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సాధు సంత్‌ల సంక్షేమం, హిందూ ధర్మ పరిరక్షణ కోసం జేఏసీ ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నూతన కమిటీని బంజారా సంఘాల జేఏసీ చైర్మన్ బానోత్ వీరు నాయక్, సేవాలాల్ సేన నాయకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పలువురు సాధు సంత్‌లు పాల్గొన్నారు.

## ముర్రేడు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

**కేసు నమోదు చేసిన ఎస్ఐ మధుప్రసాద్**

ములకలపల్లి సెప్టెంబర్ 4 ప్రభాతవార్త : ముర్రేడు వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మధుప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... ముర్రేడు వాగు ప్రాంతంలో అక్రమంగా ఇసుకను లోడ్ చేసుకుని తరలిస్తున్నారనే నమ్మదగిన సమాచారంతో పోలీసులు అక్కడ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మధుప్రసాద్ హెచ్చరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## కొత్తగూడెం క్లబ్ లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:



జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. క్లబ్ సెక్రెటరీ కోనేరు పూర్ణచంద్రరావు సతీమణి కోనేరు పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. కృష్ణాష్టమికి సంబంధించిన భక్తి గీతాలకు మహిళలు ఉత్సాహంగా నృత్యాలు చేశారు.



ఉట్టి కొట్టే కార్యక్రమం ఆకట్టుకుంది. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై సందడి చేశారు. కోనేరు దివ్య, తాటిపల్లి రాజేశ్వరి, కంభంపాటి విజయ, పలివేల గాయత్రి, ఇంటూరి సుగుణ, చెక్క కమల, మేక రత్న, పల్లపోతు కవిత, అయిత విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గణపతి నవరాత్రి ఉత్సవాల బుక్‌లెట్ ఆవిష్కరణ

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:



పట్టణంలోని శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 14 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న గణపతి నవరాత్రి ఉత్సవాల బుక్‌లెట్, వాల్ పోస్టర్‌ను శుక్రవారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించిన కార్యక్రమాల వివరాలను భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, షాబీర్ పాషా, కార్పొరేటర్ దుర్గ తదితరులు పాల్గొన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్.రజని కుమారి పాల్గొన్నారు.

## శిరీష కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి

**ఎమ్మెల్యే కూనంనేని**

ములకలపల్లి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:



హైదరాబాద్‌లో దారుణ ఘటనకు బలైన ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఊకె శిరీష కుటుంబాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శుక్రవారం పరామర్శించారు. చౌటిగూడెంలోని శిరీష స్వగృహానికి చేరుకున్న ఆయన, శిరీష చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ హైదరాబాద్ వంటి మహానగరంలోనూ మహిళలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో, ముఖ్యంగా రాత్రి వేళల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. శిరీష పనిచేసిన ఆసుపత్రిలో తగిన భద్రతా వసతులు కల్పించకపోవడం వల్లే ఈ దారుణం జరిగిందని ఆరోపించారు. ఘటనకు బాధ్యులైన ఆసుపత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర డీజీపీతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.1 కోటి పరిహారం ప్రకటించాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, జీవనోపాధి కోసం 5 ఎకరాల వ్యవసాయ భూమి కేటాయించాలని కూనంనేని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ పార్టీ తరఫున శిరీష దశదిన కర్మల నిర్వహణ కోసం మూడు క్వింటాళ్ల బియ్యాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ గణేష్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నరాటి ప్రసాద్, మండల కార్యదర్శి ఎం.డి. యూసుఫ్, నరాటి రమేష్, పువ్వాల లలితారావు, జబ్బార్, అనుమాల సాయి, వీరూనాయక్, రంజిత్, ఇమ్మానియేలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:



కృష్ణాష్టమి వేడుకలు కొత్తగూడెంలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులను తల్లిదండ్రులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలతో అందంగా అలంకరించి వేడుకలకు తీసుకువచ్చారు. చిన్నారులు బుడిబుడి అడుగులతో సందడి చేస్తూ ఆకట్టుకోవడంతో పరిసరాలు ఆహ్లాదకరంగా మారాయి. తమ చిన్నారులను కృష్ణుడు, గోపికల రూపంలో చూసిన తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీకృష్ణునికి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## అంగన్వాడీ కేంద్రంలో పర్యావరణ హిత కృష్ణాష్టమి

**పాల్గొన్న కార్పొరేటర్ జల్లి శ్రీలక్ష్మి**

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:



సాంస్కృతిక సంప్రదాయాలతో పాటు పర్యావరణ పరిరక్షణను జోడిస్తూ కొత్తగూడెం పట్టణం 28వ డివిజన్ గొల్లగూడెం లోని అంగన్వాడి సెంటర్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఎంతో విశిష్టంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కార్పొరేటర్ జల్లి శ్రీలక్ష్మి పండుగ సంబరాలలో భాగంగా చిన్నారులలో పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. భక్తి శ్రద్ధలతో పాటు ప్రకృతి ఆరాధన సాధారణంగా పండుగలు అంటే పిండి వంటలు, పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం అవుతాం. కానీ కొత్తగూడెం 28వ డివిజన్ గొల్లగూడెం అంగన్వాడీ కేంద్రం ఇందుకు భిన్నంగా నిలిచింది. ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు గోవులను, ప్రకృతిని, అడవులను ఎలా ప్రేమించాడో అదే తత్వాన్ని నేటి తరానికి అందించేలా ఈ వేడుకలను డిజైన్ చేశారు. పచ్చదనాన్ని కాపాడుకోవడం కూడా భగవంతుని సేవలోనే భాగమనే సందేశాన్ని ఇక్కడ చాటిచెప్పారు. చిన్నారుల వేషధారణ.. ఆకట్టుకున్న గ్రీన్ ఇనిషియేటివ్ రంగురంగుల సంప్రదాయ దుస్తుల్లో, నెమలి పింఛాలు ధరించి చిన్నారులు వేసిన బాలకృష్ణాష్టమి వేషధారణలు ముగ్ధులను చేశాయి. రాధాకృష్ణుల నృత్య రూపకాలు భక్తులను అలరించాయి. అయితే, ఈ వేడుకల్లో అసలైన హైలైట్ కార్పొరేటర్ జల్లి శ్రీలక్ష్మి చేతుల మీదుగా జరిగిన మొక్కల పంపిణీ. కృష్ణుడి వేషంలో ఉన్న ఒక చిన్నారి పసిచేతులతో మొక్కను అందుకొని, కార్పొరేటర్‌తో కలిసి నిల్చున్న దృశ్యం సామాజిక మాధ్యమాల్లో సైతం వైరల్‌గా మారుతోంది. భావితరాలకు పర్యావరణ పాఠం ఈ సందర్భంగా కార్పొరేటర్ జల్లి శ్రీలక్ష్మి మాట్లాడుతూ... "చిన్న వయసులోనే పిల్లల మనస్సులో పర్యావరణం పట్ల బాధ్యతను నాటాలి. అప్పుడే వారు రేపటి పౌరులుగా ప్రకృతిని గౌరవిస్తారు. పండుగలను పర్యావరణానికి హాని కలగకుండా, ప్రకృతిని మరింత పచ్చగా మార్చేలా జరుపుకోవడం మన బాధ్యత" అని పిలుపునిచ్చారు. ఈ గ్రీన్ ఇనిషియేటివ్‌ను స్థానిక వార్డు ప్రజలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయా సిబ్బంది విజయవంతం చేశారు. పండుగకు సరికొత్త అర్థాన్ని ఇచ్చిన ఈ కార్యక్రమం చుట్టుపక్కల ప్రాంతాల వారికి సైతం ఆదర్శంగా నిలుస్తోంది.

## రామవరంలో ఘనంగా జులూస్‌ఏమొహమ్మది ర్యాలీ

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: ప్రవక్త హజరత్ మహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం 1501వ జన్మదినాన్ని పురస్కరించుకుని రామవరంలో జులూస్‌ఏ మొహమ్మది శాంతియుత భారీ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. రామవరం 14వ నంబర్ మదీనా మసీదు నుంచి ప్రారంభమైన ర్యాలీని అంజుమన్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ డా. నయీమ్ ఖురేషి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త జీవితంలో ఆచరించిన ప్రేమ, శాంతి, సోదరభావం, మానవతా విలువలను ముస్లిం సోదరులకు వివరించారు. ర్యాలీలో మసీదు ఇమాములు, నిర్వాహకులు, మైనారిటీ నాయకులు, వివిధ మసీదుల కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏ డబ్ల్యూ ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండీ అమీర్ ఖాద్రి, శమీయుద్దీన్, ఫయామ్ దాదా, ఖయ్యూం, ఎండీ జమాల్, బాబు జానీ, యూసుఫ్ బాబా, షఫీ తదితరులు పాల్గొన్నారు.



## భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుల జాబితా విడుదల

**కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:**



ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారి జాబితాను జిల్లా విద్యాశాఖాధికారిణి డి.వాసంతి శుక్రవారం విడుదల చేశారు. సెప్టెంబర్ 5న కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించనున్న ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులు, ఉద్యోగులను సన్మానించనున్నారు. ఎంపికైన ఉపాధ్యాయులు శనివారం మధ్యాహ్నం 1 గంటలోపు కొత్తగూడెం క్లబ్‌కు చేరుకుని రిపోర్ట్ చేయాలని డీఈఓ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని ఆహ్వాన కమిటీ పర్యవేక్షణలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, శాసనమండలి సభ్యులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు డీఈఓ డి.వాసంతి తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఆంగ్ల టీచర్లకు ఎల్టా అభినందనలు

**కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఆంగ్ల ఉపాధ్యాయులను ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) జిల్లా కమిటీ అభినందించింది. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కే. సైదులు (జెడ్పీహెచ్‌ఎస్ చల్లసముద్రం), ఎస్.కే. జహంగీర్ షరీఫ్ (జెడ్పీహెచ్‌ఎస్ గారిబుపేట), జె. రవికుమార్ (జెడ్పీహెచ్‌ఎస్ రాజాపురం), బి. అరుణ (జెడ్పీహెచ్‌ఎస్ భద్రాచలం గర్ల్స్), పి.ఎస్.వి. ప్రసాద్ (జీహెచ్‌ఎస్ భద్రాచలం), ఏ. బాలాజీ (జీహెచ్‌ఎస్ పాత కొత్తగూడెం)లకు ఎల్టా జిల్లా అధ్యక్షుడు షేక్ దస్తగిరి, ప్రధాన కార్యదర్శి, జిల్లా ఆంగ్ల రిసోర్స్ పర్సన్స్ టీం లీడర్ డాక్టర్ షేక్ మీరా హుస్సేన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యావ్యవస్థ పరిరక్షణలో ఆంగ్ల ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు నిరంతరం తమ జ్ఞానాన్ని పెంపొందించుకుంటూ, బోధనలో కృత్రిమ మేధ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించి విద్యార్థులకు మరింత చేరువయ్యేలా బోధనా పద్ధతులను, వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను గౌరవించడం గొప్ప సంప్రదాయమని వారు పేర్కొన్నారు.

## కరెంట్ మీటర్ కట్.. భర్త మృతి!

### అధికారులపై రజిత ఫైర్

**పాల్వంచ టౌన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:**

250 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమల్లో ఉన్నప్పటికీ తమ ఇంటి విద్యుత్ కనెక్షన్‌ను విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించడంతో తీవ్ర మనోవేదనకు గురైన తన భర్త అవనిగంటి రాజేష్ మృతి చెందారని భార్య రజిత ఆరోపించారు. పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె విద్యుత్ శాఖ అధికారులపై తీవ్ర ఆరోపణలు చేశారు. మీటర్ తొలగించిన అధికారులు, ప్రభుత్వ నిబంధనలను చూపించిన అనంతరం హడావుడిగా విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరించారని ఆమె తెలిపారు. తన భర్త మృతికి విద్యుత్ శాఖ అధికారులే పరోక్షంగా కారణమని ఆరోపిస్తూ, ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ కనెక్షన్ తొలగింపులో తమకు అన్యాయం జరిగిందంటూ చిటికెన ముసలయ్యపై కూడా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని రజిత కోరారు.




## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### రేవంత్‌రెడ్డి 1000 రోజుల పాలనపై డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల

**పాల్వంచ టౌన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 1000 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా సుజాతనగర్‌లో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కొత్వాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి భారీ కేక్ కట్ చేయగా కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజాపాలనలో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రైతుల కోసం రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమా, సన్నధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్, మద్దతు ధర వంటి పథకాలను అమలు చేసిందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి తక్కువ వడ్డీకే రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, అర్హులకు రేషన్ కార్డుల పంపిణీ, ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుంబూరి దయాకర్‌రెడ్డి, ఆళ్ల మురళి, వూకంటి గోపాలరావు, నాగ సీతారాములు, చీకటి కార్తీక్, యర్రంశెట్టి ముత్తయ్య, పైడిపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కొరత..

**పాల్వంచ, సెప్టెంబర్ 04,ప్రభాత వార్త:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు మౌలిక సదుపాయాల కొరతతో కొనసాగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అనేక కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో నిర్వహిస్తుండగా,అక్కడ కూడా కనీస వసతులు లేక చిన్నారులు,గర్భిణులు,బాలింతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు.తాగునీరు,మరుగుదొడ్లు,విద్యుత్,ఫర్నిచర్ వంటి ప్రాథమిక సౌకర్యాలు చాలా కేంద్రాల్లో లేవని స్థానికులు పేర్కొంటున్నారు.కొన్ని కేంద్రాలు కార్యకర్తల సొంత ఇళ్లలోనే నిర్వహించబడుతుండటంతో సమయపాలన సరిగా పాటించబడడం లేదని,ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన కేంద్రాలు ఆలస్యంగా తెరుచుకుంటున్నాయని ఆరోపిస్తున్నారు.మరికొన్ని కేంద్రాల్లో కార్యకర్తలు ఇష్టానుసారంగా రావడం,వెళ్లిపోవడం జరుగుతోందని అంటున్నారు.అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాల్లో వంటగది,పిల్లలు చదివే గది ఒకటే ఉండటం వల్ల పరిశుభ్రత,భద్రత పరంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు తెలిపారు.పిల్లలకు అందించాల్సిన పోషకాహారం నాణ్యత,మెనూ అమలుపై కూడా స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.అదనంగా,పిల్లలకు అవసరమైన ఆట వస్తువులు,బోధన సామగ్రి,పోషకాహార సరఫరాలో కూడా కొన్నిచోట్ల సమస్యలు ఉన్నట్లు తెలుస్తోంది.కేంద్రాల మరమ్మతులు చేపట్టి, అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేసి సేవలను మరింత మెరుగుపర్చాలని గ్రామస్తులు,తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న లోటుపాట్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి,తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



## పాల్వంచ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా పసుమర్తి (గోల్డ్) రాము ఏకగ్రీవ ఎన్నిక

**పాల్వంచ,సెప్టెంబర్ 4,ప్రభాత వార్త:**



పాల్వంచ పట్టణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటైన పాల్వంచ గణేష్ ఉత్సవ సమితి-2026 అధ్యక్షుడిగా పసుమర్తి (గోల్డ్) రామును,కార్యదర్శిగా వేములపల్లి ప్రవీణ్‌ను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.పట్టణంలోని జయమ్మ కాలనీలోని శ్రీ లక్ష్మీ ్మ లేక్ వ్యూ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన గణేష్ ఉత్సవ సమితి సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది.ఈ విషయాన్ని విశ్వహిందూ పరిషత్ ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పసుమర్తి (గోల్డ్) రాము మాట్లాడుతూ, పట్టణంలోని హిందువులందరూ పరస్పర సహకారంతో, వివాదాలకు,అల్లర్లకు తావు లేకుండా,మండపాల వద్ద తగిన జాగ్రత్తలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు.అలాగే మండప నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ అధికారులు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో గణేష్ ఉత్సవ సమితి సభ్యులు చిలుకూరి నాగేశ్వరరావు, చింతలచెరువు శ్రీనివాస్,రాపాక రమేష్, చెరుకు భాగ్యలక్ష్మి ్మ,గంగాధరి సీత,చల్లా లింగన్న,విజయ్ శంకర్,శ్రీరామోజు మధుసూదన చారి,రామగిరి ప్రసాద్, రంజిత్,దాసరి మాధవరావు,నూకల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## హేమచంద్రపురం పేకాట దాడులపై సస్పెన్స్ ప్రముఖుల పేర్లపై ప్రచారం..

### అధికారికంగా వివరాలు వెల్లడించని పోలీసులు

**లక్ష్మీ ్మదేవిపల్లి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:**

హేమచంద్రపురం గ్రామంలో జరిగినట్లు ప్రచారం జరుగుతున్న పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ దాడిలో పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం ఉన్నప్పటికీ, పోలీసులు ఇప్పటివరకు అధికారిక వివరాలను వెల్లడించలేదు. స్థానికంగా జరుగుతున్న ప్రచారం ప్రకారం పట్టుబడిన వారిలో ప్రముఖ వైద్యులు, కేటీపీఎస్ ఉద్యోగులు, న్యాయవాది, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్లు చెబుతున్నారు. అయితే ఈ విషయాలపై పోలీసుల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దాడి జరిగిన ప్రదేశం, పట్టుబడిన వారి సంఖ్య, స్వాధీనం చేసుకున్న నగదు వంటి అంశాలపై స్పష్టత లేకపోవడంతో పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రముఖులు ఉన్నారనే ప్రచారం నేపథ్యంలో పోలీసులు పూర్తి వివరాలు వెల్లడిస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం అధికారిక ప్రకటన అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

## దుమ్ముగూడెంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**దుమ్ముగూడెం :ప్రభాతవార్త (సెప్టెంబర్ 4)**

శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని దుమ్ముగూడెం మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాలలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవాలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు వైభంగా నిర్వహించారు అలాగే మండలంలోని దుమ్ముగూడెం వర్క్ షాప్ లక్ష్మీ ్మనగరం సీతారాంపురం బండి రేవు తదితర గ్రామాల్లో ఉట్టిని కొట్టే కార్యక్రమాన్ని ఆనందోత్సాహాలు నడుమ నిర్వహించారు అనేకమంది భక్తులు పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు



## పుష్కరాల లోపే కొత్త విస్టా కాంప్లెక్స్ నిర్మించాలి

**పాత వ్యాపారస్తులకే తిరిగి దుకాణాలు కేటాయించాలి**

**మంత్రి పొంగులేటికి వ్యాపారస్తుల వినతి**

భద్రాచలం, సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త):



శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలోని విస్టా కాంప్లెక్స్ పునర్నిర్మాణాన్ని వేగవంతం చేసి, రాబోయే గోదావరి పుష్కరాల లోపే నూతన కాంప్లెక్స్‌ను నిర్మించాలని విస్టా కాంప్లెక్స్ వ్యాపారస్తులు తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. కొత్త కాంప్లెక్స్ నిర్మించిన అనంతరం గతంలో వ్యాపారం చేసిన పాత వ్యాపారస్తులకే తిరిగి దుకాణాలను కేటాయించి న్యాయం చేయాలని వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. భద్రాచలం గ్రామపంచాయతీ 1వ వార్డు సభ్యుడు చెంచు సుబ్బారావు, 3వ వార్డు సభ్యురాలు బొంత రమణ ఆధ్వర్యంలో విస్టా కాంప్లెక్స్ వ్యాపారస్తులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు మాట్లాడుతూ, గత 15 నుంచి 20 సంవత్సరాలుగా విస్టా కాంప్లెక్స్‌లో వ్యాపారాలు నిర్వహిస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. శ్రీ సీతారామాలయ అభివృద్ధిలో భాగంగా విస్టా కాంప్లెక్స్‌ను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, తమకు ఇంకా రెండేళ్ల అగ్రిమెంట్ గడువు ఉన్నప్పటికీ రామాలయ అభివృద్ధికి సహకరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ నిర్ణయాన్ని గౌరవించామని పేర్కొన్నారు. లక్షల రూపాయల విలువైన సరుకు నష్టపోయే పరిస్థితి ఉన్నప్పటికీ స్వచ్ఛందంగా దుకాణాలను ఖాళీ చేసి దేవస్థానానికి అప్పగించామని తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యల సహకారంతో భద్రాచలం అభివృద్ధి వేగంగా సాగుతుందని తాము విశ్వసిస్తున్నామని వ్యాపారస్తులు తెలిపారు. అయితే రానున్న గోదావరి పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు భద్రాచలానికి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో, దుకాణాలు ఉంటాయనే ఆశతో అప్పులు చేసి, చిట్ ఫండ్ల ద్వారా లక్షల రూపాయల విలువైన సరుకును కొనుగోలు చేసి నిల్వ ఉంచుకున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త దుకాణాలు అందుబాటులోకి రాకపోతే నిల్వ ఉంచిన సరుకు పాడై తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే గోదావరి పుష్కరాల లోపే దేవస్థానం ఆధ్వర్యంలో నూతన విస్టా కాంప్లెక్స్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. గతంలో అగ్రిమెంట్‌ను రద్దు చేసుకుని, ఆలయ అభివృద్ధి కోసం స్వచ్ఛందంగా దుకాణాలను ఖాళీ చేసిన పాత వ్యాపారస్తులకే తిరిగి దుకాణాలను కేటాయించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రభుత్వం తమ కష్టాలను అర్థం చేసుకుని న్యాయం చేస్తుందనే ఆశాభావాన్ని వ్యాపారస్తులు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చెంచు సుబ్బారావు, బొంత రమణతో పాటు విస్టా కాంప్లెక్స్ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## శ్రీ దాసాంజనేయస్వామి ఆలయంలో గోపూజ

దుమ్ముగూడెం :ప్రభాతవార్త (సెప్టెంబర్ 4)

మండల పరిధిలోని లక్ష్మీనగరం గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవాలయం వద్ద శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా శుక్రవారం గోపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు టిటిడి నుండి గోపూజ కార్యక్రమానికి దేవాలయానికి 1250 రూపాయలను అందించారు ఈ సందర్భంగా టిటిడి హెచ్డిపిపి ధర్మచార్య పిలక నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో గోవుకు పసుపు కుంకుమలతో పూజించారు గోమాత గోమాత ప్రాసత్యం వేదాలతో గోస్తుతి గోప్రదక్షణ మహత్యం గోపూజ విశిష్టతను నాగేందర్ రెడ్డి భక్తులకు వివరించారు ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సిరపు వీర రాఘవరెడ్డి సభ్యులు గుడ్ల శ్రీనివాసరెడ్డి తాతారావు సత్యనారాయణరెడ్డి శివరావు ఆలయ అర్చకుడు వెంకటాచారి మోహనాచార్యులు అనేకమంది మహిళా భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# భక్తి పారవశ్యంలో.. బూర్గంపహాడ్!

**శ్రీకృష్ణ నామస్మరణతో మార్మోగిన పల్లెలు..**

**కన్నులపండువగా జన్మాష్టమి వేడుకలు**

**ఆలయాల్లో ప్రత్యేక పూజలు..**

**స్వామివారి వైభవ ఊరేగింపులు..**

**కోలాటాలతో మహిళల సందడి**

**ఉట్టి కొట్టే వేడుకలకు పోటెత్తిన భక్తులు..**

**రాధ, సత్యభామ, బాలకృష్ణుల వేషధారణల్లో చిన్నారుల కనువిందు**

బూర్గంపహాడ్, ప్రభాత వార్త:

శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం బూర్గంపహాడ్ మండలాన్ని భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. పల్లెలన్నీ పండుగ శోభను సంతరించుకోగా.. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున నుంచే మంగళవాయిద్యాలు, భజనలు, కీర్తనలు, శ్రీకృష్ణ నామస్మరణలతో పల్లెలు మార్మోగాయి. చిన్నారులు, మహిళలు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోపాలుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుకున్నారు. బూర్గంపహాడ్, మొరంపల్లి బంజర, లక్ష్మీపురం, టేకులచెరువు, నకిరేపేట, ముసలిమడుగు, సారపాక, గాంధీనగర్, తాళ్లగొమ్మూరు, కోయగూడెం, మోతెపట్టినగర్ తదితర గ్రామాల్లో జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ స్థానిక సంప్రదాయాలకు అనుగుణంగా పూజలు, ఊరేగింపులు, అన్నదానాలు, కోలాటాలు, ఉట్టి కొట్టే కార్యక్రమాలు చేపట్టారు.

**ఆలయాల్లో భక్తి సందడి**

జన్మాష్టమిని పురస్కరించుకుని మండలంలోని ఆలయాల్లో తెల్లవారుజామున నుంచే శ్రీకృష్ణుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించారు. పూలతో అలంకరించిన స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. పలువురు భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి స్వామివారిని దర్శించుకుని కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం ప్రార్థనలు చేశారు. ఆలయ ప్రాంగణాల్లో భజనలు, కీర్తనలు, హరినామ సంకీర్తనలు నిర్వహించడంతో పల్లెల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది.

**బూర్గంపహాడ్‌లో ఘనంగా ఊరేగింపు**

బూర్గంపహాడ్ గ్రామంలో శ్రీకృష్ణ ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారి ప్రతిమను మంగళవాయిద్యాలు, భక్తుల కృష్ణనామస్మరణల నడుమ గ్రామంలో ఊరేగించారు. ఊరేగింపులో మహిళలు, యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై మేడా ప్రసాద్ హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం యాదవ సంఘం ప్రతినిధులు ఎస్సై మేడా ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు.



**ఉట్టి కొట్టే వేడుకకు భారీ స్పందన**

సాయంత్రం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం బూర్గంపహాడ్ జన్మాష్టమి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉట్టి కొట్టే వేడుకను వీక్షించేందుకు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. యువత ఉత్సాహంగా పాల్గొనగా.. చుట్టూ చేరిన ప్రజలు కృష్ణుని బాల్యలీలలను స్మరించుకుంటూ వేడుకలను ఆస్వాదించారు. కులమతాలకు అతీతంగా ప్రజలంతా ఒకచోట చేరడం ద్వారా జన్మాష్టమి సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.

**గాంధీనగర్‌లో కృష్ణనామస్మరణ**

గాంధీనగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో తెల్లవారుజామున నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణం అంతా కృష్ణనామస్మరణతో మార్మోగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం గాంధీనగర్–సారపాక–కోయగూడెం ప్రధాన కూడలిలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో కోలాట నృత్యాలతో స్వామివారి ఊరేగింపులో పాల్గొని కనువిందు చేశారు. కోలాటాల సందడి, భక్తిగీతాలు, మంగళవాయిద్యాలు, కృష్ణనామస్మరణతో పరిసర ప్రాంతం పండుగ శోభను సంతరించుకుంది.

**లక్ష్మీపురంలో కోలాటాలతో కనువిందు**

లక్ష్మీపురం గ్రామంలో జన్మాష్టమి వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భద్రాచలం ప్రాంతానికి చెందిన కోలాట నృత్య కళాకారుల ఆధ్వర్యంలో మహిళలు గ్రామంలోని ప్రధాన రహదారి నుంచి ముత్యాలమ్మ ఆలయం వరకు సంప్రదాయ కోలాట ప్రదర్శన నిర్వహించారు. శ్రీకృష్ణుని స్మరిస్తూ మహిళలు సమన్వయంతో ప్రదర్శించిన కోలాటం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. అడుగడుగునా భక్తిభావం ఉట్టిపడేలా సాగిన ఈ సాంస్కృతిక ప్రదర్శన గ్రామంలో ఆధ్యాత్మిక సందడిని మరింత పెంచింది.

**టేకులచెరువులో బాలకృష్ణుల సందడి**

టేకులచెరువు గ్రామంలో శ్రీకృష్ణుడికి అత్యంత వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించగా.. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, సత్యభామ వేషధారణల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బాలకృష్ణుల వేషధారణలో చిన్నారుల సందడి, ఉట్టి కొట్టే కార్యక్రమం, భక్తుల నామస్మరణలతో గ్రామం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. మహిళలు, యువత, పెద్దలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

**ప్రతి పల్లెలోనూ.. కృష్ణభక్తి వెల్లువ**

మొరంపల్లి బంజర, నకిరేపేట, ముసలిమడుగు, సారపాక, తాళ్లగొమ్మూరు, కోయగూడెం, మోతెపట్టినగర్ తదితర గ్రామాల్లోనూ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు, కీర్తనలు, అన్నదానాలు చేపట్టగా.. పలుచోట్ల స్వామివారి ఊరేగింపులు, ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు బాలకృష్ణుల వేషధారణలో పాల్గొనడం, మహిళలు కోలాటాలతో సందడి చేయడం, యువత ఉట్టి కొట్టే వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనడం పండుగకు మరింత శోభను తెచ్చింది.

**భక్తి.. సంప్రదాయం.. సామాజిక ఐక్యతకు ప్రతీక**

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక ఐక్యతను చాటిచెప్పాయి. శ్రీకృష్ణుని బాల్యలీలలు, గోపికల భక్తి, ధర్మ పరిరక్షణ సందేశాన్ని స్మరించుకుంటూ ప్రజలు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. భక్తుల ఊరేగింపులు.. అన్నప్రసాద వితరణ.. మహిళల కోలాటాలు.. ఉట్టి కొట్టే వేడుకలు.. చిన్నారుల కృష్ణవేషధారణలతో బూర్గంపహాడ్ మండలం మొత్తం ఒకే ఆధ్యాత్మిక వేదికగా మారింది. “గోవిందా.. గోపాలా.. జై శ్రీకృష్ణ” అంటూ మార్మోగిన నామస్మరణల మధ్య పల్లెలన్నీ కృష్ణభక్తిలో తడిసి ముద్దయ్యాయి. భక్తి, సంప్రదాయం, సంస్కృతి, సోదరభావాన్ని చాటిన జన్మాష్టమి వేడుకలు మండల ప్రజల మనసుల్లో చిరస్మరణీయంగా నిలిచాయి.

# హామీలు బాకీ.. 1000 రోజుల పాలన దగా

**బాకీ కార్డులతో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన**

**మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత**

బూర్గంపహాడ్, ప్రభాతవార్త:

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ఆరోపించారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో మహిళలు, వృద్ధులు, బీడీ కార్మికులు, దివ్యాంగులు, విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేరలేదని విమర్శించారు. శుక్రవారం బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురం గ్రామంలోని మాజీ జడ్పీటీసీ క్యాంపు కార్యాలయం వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బాకీ కార్డులు ప్రదర్శించి ఆందోళన నిర్వహించారు. మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులు, బీడీ కార్మికులకు రూ.4 వేల పింఛన్, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల కింద ఆడబిడ్డల వివాహాలకు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.12 వేల కోట్లకు చేరాయని పేర్కొంటూ బాకీ కార్డులను ప్రదర్శించారు. ఎన్నికల సమయంలో అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, 1000 రోజులు గడిచినా వాటిని అమలు చేయలేదని శ్రీలత మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీనివాసరావు, మేడిగం లక్ష్మీనారాయణ, పొడియం నరేంద్ర, సానికొమ్ము శంకర్‌రెడ్డి, పాలెం దివాకర్‌రెడ్డి, పోతిరెడ్డి గోవిందరెడ్డి, గోనెల నాని, తోకల సతీష్, మందా ప్రసాద్, పూర్ణ, సోము లక్ష్మీచైతన్యరెడ్డి, బెజ్జంకి కనకాచారి, తిరుపతి ఏసోబు, గుల్మహ్మద్, సాలయ్య తదితరులు పాల్గొన్నారు.